




# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ






| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 16 | ది. 14-4-2026 | మంగళవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 16 | Date : 14-4-2026 | Tuesday | Pages : 8 | Rs.1/- |


## జనాభా ఆధారంగా లోక్ సభ సీట్లు

**-బీజేపీ కుట్ర చేస్తుంది - ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్,ఏప్రిల్ 13 (వార్తాప్రభ) :** జనాభా ఆధారంగా లోక్ సభ సీట్లను పెంచాలని బీజేపీ చూస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ప్రధాని మోదీని ఉద్దేశిస్తూ ఆయన ట్వీట్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చే మహిళా బిల్లుకు ప్రతి ఒక్కరు మద్దతిస్తారని ఆయన పేర్కొన్నారు. కానీ లోక్ సభ సీట్ల పెంపు విషయంలోనే భిన్నాభిప్రా యాలు ఉన్నాయని తెలిపారు. లోక్ సభ సీట్ల పెంపు విషయంపై అఖిల పక్ష భేటీలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని అన్నారు.




## శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానము

**పెనుగంచిప్రోలు, ఎన్‌టీఆర్ జిల్లా /112424.**

**కంప్యూటర్ నెం. తేది : 112424/2026 -13-04-2026**

### బహిరంగ వేలం ప్రకటన

ఈ క్రింది తెలియపరచిన శ్రీ అమ్మవారి హక్కు భుక్తములో గల భూములకు సర్వే నెంబర్లులలో భూముల కౌలు నిమిత్తం 2026-2027 నుండి 2028-2029 వరకు అనగా రెండు సంవత్సరముల కాలపరిమితికి సంబంధించి ది.20.4.2026 ఉదయం 11.00 గంటలకు బేడా మండపం నందు సీల్డ్ టెండర్-కం బహిరంగ వేలము - నిర్వహించుటకు నిర్ణయించడమైనది.

| వ. నెం. | సర్వే నెం. | గ్రామము | విస్తీర్ణము య. సెంట్లు | మెరక/పల్లం | ధరావత్తు సొమ్ము |
|---|---|---|---|---|---|
| 1) | 50 | పెనుగంచిప్రోలు | 12.39 | మాగాణి | 50,000/- |
| 2) | 2/1,2/3A | సుబ్బాయి గూడెం | 5.20 | మెరక | 25,000/- |
| 3) | 2/1,2/3A | సుబ్బాయి గూడెం | 6.33 | మెరక | 25,000/- |
| 4) | 2/1,2/3A | సుబ్బాయి గూడెం | 3.00 | మెరక | 25,000/- |
| 5) | 2/1,2/3A | సుబ్బాయి గూడెం | 3.00 | మెరక | 25,000/- |
| 6) | 646 | సుబ్బాయి గూడెం | 10.88 | మాగాణి | 50,000/- |

నెం.1 నుండి 6 వరకు ఉన్న సర్వే నెంబరు హక్కులకు సీల్డ్ టెండర్-కం బహిరంగ వేలము సంబందించి 6 నెంబర్లు భూముల కౌలు హక్కులకు సీల్డ్ టెండర్ - కం బహిరంగ వేలము నిర్వహించుట జరుగును. కావున పై భూముల కౌలు హక్కులకు సంబందించి ఇతర వివరముల కొరకు 8639131037, 8008192588 లను సంప్రదించగలరు.

**శ్రీ అమ్మవారి సేవలో**

**సం/- బి.మహేశ్వరరెడ్డి**
**ఉప కమీషనరు మరియు**
**కార్యనిర్వహణాధికారి**



**మహారాజశ్రీ విజయవాడ రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**

ఓ.ఎస్.నెంబర్. 1035/2020

బిట్వీన్ :

ఐసిఐసి బ్యాంక్ లిమిటెడ్, విజయవాడ, రిప్రజెంటెడ్ బై జిపిఏ హోల్డర్, విజయవాడ

-------వాది

మరియు

కానల వెంకట రెడ్డి. S/0 వెంకట రెడ్డి, నివాసం : డోర్ నెం.19-1-171, D-3, వినాయక నగర్, అనంతపూర్-515001, ఆంధ్రప్రదేశ్.

పై నెంబరు దావా నందు పైన తెలిపిన ప్రతివాదికి దావా సమన్లు అందజేయు నిమిత్తం ది.01-05-2026వ తేదీకి వాయిదా వేసినారు. కావున పైన తెలిపిన ప్రతివాది వాయిదా రోజు ఉదయం గం.10.30 ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరు అయి వారికి గల ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేని యెడల వారి పరోక్షమందు సదరు పై దావా తీర్మానము కాబడునని ఇందుమూలముగా తెలియచేయటమైనది..

(కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారము)
వాయిదా తేది : 01-05-2026

ఇట్లు

**కునుకు రాజశేఖర్,**
**వాది తరపు అడ్వకేట్**
**గాంధీనగర్, విజయవాడ-520003**


## శరవేగంగా అనుమతులు... మరింత సరళంగా నిబంధనలు

- **బ్రిటీష్ కాలం నాటి చట్టాల తొలగింపు- అవసరమైతే ఆర్డినెన్స్**
- **పారిశ్రామిక ప్రగతికి మే కల్లా డి-రెగ్యులేషన్ ఫేజ్-2 అమలు**
- **స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ నేతృత్వంలోని కేంద్ర బృందంతో సీఎం చంద్రబాబు సమావేశం**
- **రాష్ట్రంలో అమలు చేస్తున్న డి-రెగ్యులేషన్ విధానాలపై సీఎం సమీక్ష**



**అమరావతిఏప్రిల్ 13 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు విషయంలో ఎలాంటి జాప్యం జరగ్గకుండా ఇప్పటికే అమలు చేస్తున్న విధానాలను మరింత సరళతరం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అనవసరపు చట్టాలను, నిబంధనలను తొలగించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డి-రెగ్యులేషన్ ఫేజ్-2 కార్యక్రమంపై ముఖ్యమంత్రితో చర్చించేందుకు స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం సోమవారం రాష్ట్ర సచివాలయానికి వచ్చింది. ఈ బృందంతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఈ సమీక్షలో సీఎస్ సాయి ప్రసాద్ సహా వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పరిశ్రమల ఏర్పాటులో వేగం పెంచడం... అనుమతుల సులభతరం చేయడం... అనవసరపు నిబంధనల సడలింపుపై చర్చించారు. కేంద్రం రూపొందించిన ప్రతిపాదనలను సీఎం చంద్రబాబుకు స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పరిశ్రమలకు అనుమతుల్లో జాప్యం తగ్గించడానికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలను... రూపొందించుకున్న ప్రణాళికలను ఆయా శాఖల ఉన్నతాధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్రంలో ప్రవేశపెట్టిన సంస్కరణలు, కేంద్రం సూచించిన మార్పులు, భవిష్యత్ కార్యాచరణపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగింది. ఫేజ్-1 ఎంత వరకు అమలు చేశారని... ఫేజ్-2లో ప్రస్తుత స్థితి గురించి ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. డి-రెగ్యులేషన్ ఫేజ్-1లో మొత్తం 7 శాఖల్లో 23 ప్రాధాన్యత అంశాలను పూర్తి చేశామని, ఇక ఫేజ్-2లో 28 ప్రాధాన్య అంశాలు నిర్దేశించుకున్నట్టు అధికారులు చెప్పారు. మొత్తం 47 సిఫార్సుల్లో ఇప్పటివరకు 18 అమలు కాగా, మే 31 నాటికి పూర్తి లక్ష్యం చేరుకుంటామన్నారు.

**సులభంగా అనుమతుల ప్రక్రియ..** పరిశ్రమలకు అనుమతుల ప్రక్రియలో ఉన్న క్లిష్టతను తగ్గించి, వేగం పెంచాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. బ్రిటీష్ కాలం నాటి చట్టాలు తొలగింపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ప్రస్తుతం 800కు పైగా ఉన్న నిబంధనలను 100లోపు తీసుకురావాలని, అనుమతులకు లైసెన్సులను సింగిల్ డిజిట్‌కు పరిమితం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అదే సమయంలో ప్రజల భద్రత, పర్యావరణ పరిరక్షణ వంటి కీలక అంశాల్లో రాజీ పడొద్దని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అనవసర వేధింపులు లేకుండా థర్డ్ పార్టీ తనిఖీలకు ప్రాధాన్యం ఇవ్వాలని, డబుల్ లైసెన్సింగ్ వంటి వాటిని పూర్తిగా తొలగించాలని సూచించారు. ఒకసారి రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యాపారాలకు జీవితకాల చెల్లుబాటు ఉండేలా... వ్యవస్థను తీర్చిదిద్దాలన్నారు. ఇక ఫైర్ సేఫ్టీ అంశంలో నేషనల్ బిల్డింగ్ కోడ్ స్థానంలో రాష్ట్రానికి అనుకూలమైన, సరళమైన నిబంధనలు అమలు చేయాలని ఆదేశించారు. దరఖాస్తు నుంచి అనుమతి వరకూ మొత్తం ప్రక్రియను ఆన్‌లైన్ చేయాలని, ఫేజ్-2 అమలు అనంతరం పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన సమయం కనీసం 40 శాతం వరకు తగ్గేలా కార్యాచరణను రూపొందించాలని పేర్కొన్నారు.

**ఒకే శాఖలోని అన్ని అనుమతుల విలీనం..** డి-రెగ్యులేషన్ ఫేజ్-2 అమలుకు అవసరమైన ఆర్డినెన్సులు తీసుకురావాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. పరిశ్రమలు, వ్యాపారాల కోసం ప్రస్తుతం 82 రకాల అనుమతులు తీసుకోవాల్సి ఉందని... ఆ సంఖ్యను దశలవారీగా 57 వరకు తగ్గించాలని సీఎం సూచించారు. బిల్డింగ్ ప్లాన్ ఆమోదాలు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు వంటి కీలక అనుమతులు 30 వరకు ఉన్న ప్రక్రియలను 18కు తగ్గించేలా చూడాలన్నారు. ఒకే శాఖలో ఉన్న అనుమతులను విలీనం చేయడం, పర్మిషన్లు కాకుండా... నాలా చట్టాన్ని రద్దు చేయడం వంటి నిర్ణయాలు ఇప్పటికే తీసుకోగా, భవిష్యత్తులో డిమాండ్ ఆధారిత జోనింగ్ విధానాన్ని అమలు చేసేలా లక్ష్యంగా పెట్టుకుని పని చేయాలని సీఎం స్పష్టం చేశారు.




## అమరావతి ఆస్పత్రి ఎదుట జీతాల కోసం సిబ్బంది ధర్నా



**తిరువూరు,ఏప్రిల్ 13 (వార్తాప్రభ) :** పెండింగ్ లో ఉన్న తమ జీతాలు ఇవ్వాలని తిరువూరు ఆస్టర్ రమేష్ అమరావతి ఆసుపత్రి ముందు సిబ్బంది ఆందోళన చేస్తున్నారు. ఆరు నెలలుగా జీతాలు ఇవ్వకపోతే మేము ఎలా బతకాలని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. మొత్తం 30 మందికి 6 నెలల నుండి జీతాలు రావాలని సిబ్బంది చెప్పారు. ఆసుపత్రి యాజమాన్యం జీతాలు ఇవ్వటంలేదని లేబర్ అధికారికి పిర్యాదు చేస్తే మీరు ఆసుపత్రికి వెళ్ళి యాజమాన్యంను అడగమని లేబర్ అధికారి చెప్పారని సిబ్బంది తెలిపారు. ఇక్కడ కొచ్చి జీతాలు ఇవ్వమని ధర్నా చేస్తుంటే మాపై క్రిమిలన్ కేసు పెట్టి పోలీసులు పంపించారని సిబ్బంది అవేదన వ్యక్తం చేశారు. దీంతో ఆసుపత్రి యాజమా న్యంలో ఒకరైన దేవదత్తు సిబ్బంది వద్దకు వచ్చి మీరు ధర్నా చేసినా, ఎమ్మెల్యే వద్దకు వెళ్లినా, ఎంపీ వద్దకు వెళ్లినా, లోకేష్ వద్దకు వెళ్లినా జీతాలు ఇచ్చేది మేము, ఆసుపత్రి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నది, మీ జీతాలు ఇస్తానని, కొంత సమయం కావాలని చెప్పారు.

## స్పెషల్ ఆఫీసర్ల సారథ్యంలో స్వచ్ఛ పంచాయతీ వైపు అడుగులు - ఎంపీడీవో చిన్న రాట్నాలు



**విస్సన్నపేట,ఏప్రిల్ 13 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో స్వచ్ఛ పంచాయితీల లక్ష్యంగా ప్రత్యేక అధికారులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పాలన చేయడం జరుగుతుందని ఎంపీడీవో చిన్న రాట్నాలు అన్నారు. 8 గంటల డ్యూటీలను పారిశుధ్య కార్మికులు నిర్వహించాలని వ్యాపార సంస్థలు మూసివేసిన సమయం నుండి మరుసటి రోజు తిరిగి ప్రారంభించే సమయం వరకు రోడ్లను పారిశుధ్య కార్మికులు పరిశుభ్రంగా ఉంచే లక్ష్యాలను పూర్తి చేయవలసి ఉంటుందన్నారు. ఉదయం డ్యూటీలు ఉన్నవారు వార్డుల వారీగా గృహల సబుదాయాలకు వెళ్లి తడి చెత్త పొడి చెత్త సేకరించవలసి ఉంటుందని ఎంపీడీవో చెప్పారు. మండలంలో స్వచ్ఛ రథం అన్ని గ్రామాలకు వస్తుందని ప్రజల వద్ద ఉన్న నిరుపయోగ ప్లాస్టిక్ ఇనుము అల్యూమినియం వస్తువులను అందించి వస్తు మార్పిడి విధానం ద్వారా గృహ అవసరాలకు సంబంధించిన వస్తువులను పొందవచ్చని గ్రామాలలో ఉన్న పిల్లలు వివాహానికి బాగా ఆకర్షితులవుతున్నారని ఎంపీడీవో తెలియజేశారు. గ్రామాలలో అంటూ వ్యాధులు ప్రబలకుండా అధికారులుగా మేము తీసుకునే ప్రజా ఉపయోగ చర్యలకు అందరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ కే లక్ష్మీ కళ్యాణి, గృహ నిర్మాణ శాఖ ఏఈ సత్యనారాయణ, వెలుగు ఏపిఎం జమలయ్య తదితరులు పాల్గొన్నారు.

## మహిళా పోలీసు స్టేషన్ సిఐపై చర్యలు తీసుకోవాలని ఎస్పీకి ఐలు వినతి



**కాకినాడ,ఏప్రిల్ 13 (వార్తాప్రభ) :** కాకినాడ బార్ అసోసియేషన్ న్యాయవాది, ఐలు రాష్ట్ర నాయకురాలు కె నాగజ్యోతి పై మహిళా పోలీసు స్టేషన్ సిఐ రవికుమార్ దురుసు గా ప్రవర్తించడంతో పాటు అవమానకరంగా మాట్లాడినందుకు ఆయనపై చర్యలు తీసుకోవాలని, న్యాయవాదుల పట్ల పోలీసులు మర్యాదగా నడుచుకోవాలని, దురుసు ప్రవర్తన మానుకోవాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఎస్పీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐలు జిల్లా అధ్యక్ష ,కార్యదర్శులు మేడపాటి ధర్మారెడ్డి , భాస్కరాచార్యులు మాట్లాడుతూ పోలీసు స్టేషన్లలో అధికారులు న్యాయవాదుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని , అలాగే న్యాయవాదులపై తరుచూ దాడులు జరుగుతున్నాయని దీనిపై ప్రభుత్వం తక్షణం స్పందించి న్యాయవాదుల రక్షణ చట్టం బిల్ తీసుకురావాలని డిమాండు చేశారు. అదేవిధంగా గత నెల 21న ఓమహిళా పిర్యాది పట్ల మహిళా పోలీస్టేషన్ లో పోలీసు అనుచితంగా ప్రవర్తించాడని మాట్లాడుతున్నారని కాకినాడ బార్ అసోసియేషన్ న్యాయవాది కె. నాగజ్యోతి దృష్టికి వస్తే స్టేషన్ కి వెళ్లి సిఐ రవికుమార్ ని ప్రశ్నించినందుకు ఆయన మహిళా న్యాయవాదిని కూడా అవమానించడం జరిగిందని తెలిపారు. ఇటువంటి సంఘటనలు తరుచూ న్యాయవాదులకు ఎదురవ్వుతున్నాయని వాపోయారు.ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండాపై అధికారులు స్పందించాలని కోరారు. జిల్లా ఎస్పీ స్పందించి విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐలు నాయకులు రామచంద్రరాజు , భద్రరావు , శైలజ,రమాదేవి, దమయంతి,ప్రేమ్ నజీర్,రామోహన్ , రాజబాబు, ప్రసాద్, వరలక్ష్మి,వీరలక్ష్మీ, భారతి మంగరాజు, రెడ్డి,సత్తిరాజు, సఫియా,నాగజ్యోతి, సతీష్,హర్ష,పవన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంప్యూటర్ శిక్షణా తరగతులు




**గుడివాడ,ఏప్రిల్ 13 (వార్తాప్రభ) :** టెన్త్ ఇంటర్ చదివిన విద్యార్థి విద్యార్థులు ఏ ప్రాంతం వారైనా ఈ వేసవి సెలవులు రెండు నెలలుగా వడ్డాది చారిటబుల్ ట్రస్ట్ నందు ఉచిత శిక్షణ ఇవ్వబడును ఈ శిక్షణలో బేసిక్ ఎమ్మెస్ ఆఫీస్ డిటిపి టైపింగ్ కొత్తగా ఇంజనీరింగ్ కి వెళ్లే వారికి సి సి ప్లస్ ప్లస్ వెబ్ డిజైన్ హెచ్టిఎంఎల్ ఆర్కిల్ పైతాన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి సెంట్రల్ గవర్నమెంట్ సర్టిఫికెట్ ఇవ్వబడును ఆసక్తి గల విద్యార్థి విద్యార్థులు నెహ్రూ చౌక్ వద్ద వల వడ్డాది చారిటబుల్ ట్రస్ట్ సంప్రదించాలని సెల్ నెంబర్ 99498 54099 వడ్డాది రాజేష్ ఓ ప్రకటన లో తెలియజేశారు.

# మహిళా పోలీసు స్టేషన్ సిఐపై చర్యలు తీసుకోవాలని ఎస్పీకి ఐలు వినతి



**కాకినాడ,ఏప్రిల్ 13 (వార్తాప్రభ) :** కాకినాడ బార్ అసోసియేషన్ న్యాయవాది, ఐలు రాష్ట్ర నాయకురాలు కె నాగజ్యోతి పై మహిళా పోలీసు స్టేషన్ సిఐ రవికుమార్ దురుసు గా ప్రవర్తించడంతో పాటు అవమానకరంగా మాట్లాడినందుకు ఆయనపై చర్యలు తీసుకోవాలని, న్యాయవాదుల పట్ల పోలీసులు మర్యాదగా నడుచుకోవాలని, దురుసు ప్రవర్తన మానుకోవాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఎస్పీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐలు జిల్లా అధ్యక్ష ,కార్యదర్శులు మేడపాటి ధర్మారెడ్డి , భాస్కరాచార్యులు మాట్లాడుతూ పోలీసు స్టేషన్లలో అధికారులు న్యాయవాదుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని , అలాగే న్యాయవాదులపై తరుచూ దాడులు జరుగుతున్నాయని దీనిపై ప్రభుత్వం తక్షణం స్పందించి న్యాయవాదుల రక్షణ చట్టం బిల్ తీసుకురావాలని డిమాండు చేశారు. అదేవిధంగా గత నెల 21న ఓమహిళా పిర్యాది పట్ల మహిళా పోలీస్టేషన్ లో పోలీసు అనుచితంగా ప్రవర్తించాడని మాట్లాడుతున్నారని కాకినాడ బార్ అసోసియేషన్ న్యాయవాది కె. నాగజ్యోతి దృష్టికి వస్తే స్టేషన్ కి వెళ్లి సిఐ రవికుమార్ ని ప్రశ్నించినందుకు ఆయన మహిళా న్యాయవాదిని కూడా అవమానించడం జరిగిందని తెలిపారు. ఇటువంటి సంఘటనలు తరుచూ న్యాయవాదులకు ఎదురవ్వుతున్నాయని వాపోయారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండాపై అధికారులు స్పందించాలని కోరారు. జిల్లా ఎస్పీ స్పందించి విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐలు నాయకులు రామచంద్రరాజు , భద్రరావు , శైలజ,రమాదేవి, దమయంతి,ప్రేమ్ నజీర్,రామోహన్ , రాజబాబు, ప్రసాద్, వరలక్ష్మి,వీరలక్ష్మీ, భారతి మంగరాజు, రెడ్డి,సత్తిరాజు, సఫియా,నాగజ్యోతి, సతీష్,హర్ష,పవన్ తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంటు మహిళా రిజర్వేషన్ వైసీపీకి కలిసి వచ్చే అంశమా ?



**విస్సన్నపేట,ఏప్రిల్ 13 (వార్తాప్రభ) :** విజయవాడ పార్లమెంట్ మహిళల ఓటర్లు శాతం 6 8 7 3 72 ఉండగా పురుషులు 675 283 మంది మాత్రమే ఉండటం మహిళా రిజర్వేషన్ కు విజయవాడ పార్లమెంట్ 20 29 ఎన్నికలకు సులువు కావటం వైసీపీకి ఈసరైన కలిసివస్తుందా అనే విషయాలను సర్వత్రా చర్చించుకుంటున్నారు. 20 19 ఎన్నికల గణాంకాల ప్రకారం ఆంధ్రప్రదేశ్లో విజయవాడ లోక్ సభ నియోజకవర్గంలో ముఖ్య గణాంకాల ప్రకారం మొత్తం ఓటర్లు 16 52 994, పురుష వాటర్ లో 6 75 283, మహిళా ఓటర్లు 6 87 3 72. విజయవాడ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో తిరువూరు ఎస్సీ, విజయవాడ తూర్పు, విజయవాడ సెంట్రల్, విజయవాడ పడమర, జగ్గయ్యపేట,నందిగామ, మైలవరం నియోజకవర్గాలు ఇప్పటివరకు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ లోని లోక్సభ నియోజకవర్గాలలో ఒకటి అయిన ఎన్టీఆర్ జిల్లా 20 22 సంవత్సరంలో ఏర్పాటు కావడం జరిగింది. ఈ నియోజకవర్గంలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా నాడు కృష్ణాజిల్లా ఏర్పడిన నాటి నుండి నేటి ఎన్టీఆర్ జిల్లా వరకు 18 సార్లు ఎన్నికలు జరగగా 11 సార్లు కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం జరిగింది. 1984 సంవత్సరంలో టిడిపి పార్లమెంట్ సభ్యునిగా వడ్డే శోభనాద్రిశ్వరరావు, 1999 గద్దె, రామ్మోహన్, 20 14, 20 19 రెండుసార్లు కేశినేని నాని( శ్రీనివాస్ ), 20 24 కేశినని( చిన్ని) శివనాథ్ టిడిపి అభ్యర్థులుగా గెలుపొందడం జరిగింది. రాబోయే కాలంలో మారుతున్న రిజర్వేషన్లు పెరుగుతున్న సీట్లు పరిగణలో తీసుకున్నప్పుడు నందిగామ పార్లమెంట్ అయ్యే పరిస్థితి ఉంటుందని అదే సమయంలో విజయవాడ పార్లమెంట్ మహిళలకు వెళ్లే అవకాశం ఉంటుందని కొందరు రాజకీయ మేధావులు జోస్యం చెబుతున్నారు. గతంలో వాట్సప్ సోషల్ మీడియా ఉండేది కాదు ఆ సమయంలో మీడియా సోదరులతో ముఖాముఖి మండల స్థాయిలో కూడా ప్రెస్ మీట్లు ఎంపీ ఎమ్మెల్యే అభ్యర్థులు కూడా నిర్వహించేవారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా ప్రజా ప్రతినిధులకు 90% మీడియా దూరమయ్యే పరిస్థితి వచ్చింది అని చెప్పాలి. మాజీ మంత్రివర్యులు దేవినేని ఉమామహేశ్వరరావు ఏ మండలానికి వెళ్ళినా మీడియా సమావేశం ఏర్పాటు చేసి ప్రతి ఒక్క సోదరునితో ముఖాముఖి వారి ఆలోచనలను షేర్ చేసుకునే పరిస్థితి ఉండేది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండు సంవత్సరాల కాలంలో నేటికీ కూడా కొన్ని మండలాల విలేకరులకు ప్రస్తుత ప్రజాప్రతినిధులతో ముఖాముఖి పరిచయం లేకపోవడం కొసమెరుపుగా చెప్పుకోవచ్చు. తిరువూరు శాసనసభ్యురాలు దళిత ఆడపడుచు దిరిశం పద్మజ్యోతి శాసన సభ్యురాలుగా ఉన్న సమయంలో మీడియా సోదరులకు గుర్తింపు ఉండేది పండుగ సమయంలో ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేసేవారు. ఆనాడు ఉండే పిఏ సత్యనారాయణ సేవలు ఎవరు మరచిపోరని ప్రజలకు అధికారులకు ప్రభుత్వానికి మధ్య ఆయన వారధిగా విశేష గుర్తింపు పొందడం జరిగింది అనే విషయం అందరికీ తెలిసిందే. ప్రస్తుత పరిస్థితులలో అధిక శాతం మీడియాకు ప్రజాప్రతినిధుల పిఏ నంబర్లు కూడా తెలియకపోవడం ఒక ట్విస్ట్ అని చెప్పవచ్చు. రాబోయే కాలంలో పాత తాలూకాల పరిధిలో ఉన్న గ్రామాలను నియోజకవర్గంగా ఏర్పాటు చేసే పరిస్థితి ఉంటుందని అదే జరిగితే విసన్నపేట నియోజకవర్గానికి ఈశాన్యంలో ఉన్న చాట్రాయి, నైరుతిన ఉన్న రెడ్డిగూడెం మండలాలు కలుపుకొని నూతన విస్సన్నపేట నియోజకవర్గం ఓసి రిజర్వేషన్ తో ఏర్పడే పరిస్థితి ఉంటుందని రాజకీయ చాణక్యులు వాక్కుగా వినిపిస్తుంది.

# హనుమాన్ జంక్షన్ లో వైభవంగా జరిగిన వరసిద్ది గణపతిస్వామి వారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం





**హనుమాన్ జంక్షన్,ఏప్రిల్ 13 (వార్తాప్రభ) :** హనుమాన్ జంక్షన్ కే ఎస్ టాకీస్ రోడ్ లో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ వరసిద్ధి గణపతిస్వామి వారి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం ఆదివారం ఉదయం అత్యంత వైభవంగా జరిగింది.కళాన్యాసములు, స్వామి వారి తొలి దర్శనం, మహా పూర్ణాహుతి అగ్ని ప్రదక్షణం శాంతి పఠనం వేద పండితులు యలమంచిలి కృష్ణమూర్తి శివాచార్య ఆధ్వర్యంలో యలమంచిలి ప్రసాద శర్మ బ్రహ్మత్వంలో కుందుర్తి సీతారామయ్య, కుందుర్తి శ్యామ్ కిరణ్ , కుందుర్తి ఈశ్వర్ మహేష్ పర్యవేక్షణలో ప్రతిష్టా మహోత్సవం నిర్వహించారు.అలాగే ఏకశిల ధ్వజస్థంభం ప్రతిష్టించారు.గత మూడు రోజులుగా వరసిద్ది గణపతి దేవాలయ కమిటీ, బాపులపాడు గ్రామ ప్రజల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతిష్టా మహోత్సవం సందర్భంగా బాలికల కోలాటం భక్తి పాటలతో అహల్లాద పరిచారు.దాతల సహకారంతో పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు.భవానీ పర్నిచర్స్ అధినేత షేక్ సాంబశివరావు శ్రీకారం చుట్టిన ఈ ఆలయ నిర్మాణానికి దాతలు దానశీలురు ముందుకు వచ్చి తమ సహాయ సహకారాలు అందించారు. ఈ కార్యక్రమంలో వడ్డి త్రివేణి కుమార్,నక్కా బాబు,పుట్టి రాంబాబు,వీరమాచినేని నాగయ్య, చెన్నుబోయిన వీరాంజనేయులు, నందూరి సత్య వేంకటేశ్వర శర్మ,పుట్టి కోటేశ్వరావు, పెరికీడు శివాలయం కమిటీ, బాపులపాడు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నగర వాతావరణాన్ని ప్రతిబింబిస్తున్న హనుమాన్ జంక్షన్

### -స్నాక్ బైట్ కేఫ్ ను ప్రారంభించిన పారిశ్రామిక వేత్త పుట్టగుంట సతీష్ కుమార్






**హనుమాన్ జంక్షన్,ఏప్రిల్ 13 (వార్తాప్రభ) :** నగర వాతావరణాన్ని ప్రతిబింబించే విధంగా గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని దీనికి ప్రత్యక్ష నిదర్శనం స్నాక్ బైట్ కేఫ్ అని ప్రముఖ పారిశ్రామికవేత్త పుట్టగుంట సతీష్ కుమార్ అన్నారు.ఆదివారం హనుమాన్ జంక్షన్ విజయవాడ రోడ్ లో నూతనంగా ఏర్పాటు చేసిన స్నాక్ బైట్ కేఫ్ ను పుట్టగుంట ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు రోజుకు హనుమాన్ జంక్షన్ పురోభివృద్ధి చెందుతుందన్నారు. దానికి అనుగుణంగా ఆహార ప్రియులు కూడా పెరుగుతున్నారని అన్నారు.పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న హనుమాన్ జంక్షన్ చుట్టుప్రక్కల ప్రాంతాలు వాటికి అనుగుణంగా పెరుగుతున్న వ్యాపారాలు హనుమాన్ జంక్షన్ అభివృద్ధికి నిదర్శనమని అన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా స్నాక్ బైట్ కేఫ్ నిర్వాహకులు పుట్టగుంటను ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయి కళ్యాణి, టి డి పి టౌన్ పార్టీ అధ్యక్షులు అట్లూరి శ్రీనివాస్,లయన్స్ గ్లోబల్ ప్రెసిడెంట్,ఆశాజ్యోతి నిర్వాహకులు మరీదు మాధవీ లత,పతంజలి జి.ఎం,కలపాల శ్రీనివాసరావు,సీనియర్ జర్నలిస్ట్ తాడి రంగారావు, స్థానిక ప్రముఖులు యలమంచిలి శ్రీరామ చంద్రమూర్తి, స్నాక్ బైట్ కేఫ్ టీమ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇకపై శ్రీ చైతన్య ప్రైమరీ విద్యావిధానంలో సరికొత్త ఎఇ విద్యా ప్రణాళిక




**అమలాపురం,ఏప్రిల్ 13 (వార్తాప్రభ) :** స్థానిక అమలాపురం శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో ఘనంగా అకడమిక్ ఎక్సలెన్స్ ప్రోగ్రాంను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రీజినల్ ఇంచార్జి ఎం. వి.ఎల్ నరేష్ మాట్లాడుతూ "40 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం కలిగిన శ్రీ చైతన్య విద్యాసంస్థల్లో విద్యార్థుల ఉన్నతి కొరకు ఎన్నో మార్పులు జరిగాయని,అందులో భాగంగా నేటి తరానికి కావాల్సిన సరికొత్త మార్పులు చేస్తూ ఇప్పుడున్న ప్రోగ్రాంకు మరింత బలం చేరేలా ఈ అకాడమిక్ ఎక్సలెన్స్ అనే ప్రోగ్రాం ను జత చేయడం జరిగిందని , ఈ ప్రోగ్రాం విద్యార్థులకు 3,4,5 తరగతుల విద్యార్థులకు అర్థమేటిక్,రీజనింగ్,ఫిజిక్స్, కెమిస్ట్రీ లను సులభంగా అవగాహన చేసుకునేందుకు దోహదపడుతుందని కొనియాడారు. ఇటువంటి ప్రోగ్రాం మన అమలాపురం చైతన్య టెక్నో స్కూల్లో ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడం పట్ల అకాడమిక్ కో-ఆర్డినేటర్ తడాల శ్రీనివాస్, ప్రైమరీ కో-ఆర్డినేటర్ పి.శిరీష , బ్రాంచి ప్రిన్సిపాల్ వసు విద్యార్థుల తల్లితండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

## పాల ఉత్పత్తి దారులకు బోనస్ పంపిణీ చేసిన విజయా డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు





**హనుమాన్ జంక్షన్,ఏప్రిల్ 13 (వార్తాప్రభ) :** హనుమాన్ జంక్షన్ క్లస్టర్ పరిధిలో పల్లేర్లమూడి బి యమ్ సి పరిధిలో గల కొయ్యూరు , సీతారామపురం పాల ఉత్పత్తి దారుల పరస్పర సహాయక సహకార సంఘాల నందు 2025 -- 2026 ఆర్థిక సంవత్సరం కు గాను మూడవ విడత బోనస్ ను విజయా డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు చేతులమీదుగా ఆదివారం పంపిణీ చేశారు.అలాగే పశువులకు చూడి నిర్ధారణ చేసే ఐదీ కిట్టుల పనితీరు మరియు తిరగపొల్లె పశువుల గర్భం పరిస్థితిఏ విధంగా ఉన్నదో తెలియజేసే AI గన్ వినియోగం గురించి తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు డి డి లింగం ప్రసాద్ ,మేనేజర్ మాగంటి హరిబాబు , ూవీూా బావిశెట్టి వెంకటేశ్వరరావు ,సెమెన్ వర్కర్లు ,పాడి రైతులు పాల్గొన్నారు.తదనంతరం కొయ్యూరు పాల ఉత్పత్తి దారులు పాల రేటు పెంచి నందుకు మరియు పశువులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన వైద్యం అందుబాటు లోకి తెస్తున్నందుకు చైర్మన్ చలసాని ఆంజనేయులుని శాలువాలతో సత్కరించారు .

## బెల్ట్ షాపులు నిర్వహిస్తే బెండు చేస్తామన్నారు?

### -జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి సిరసాని ప్రకాష్



**విస్సన్నపేట,ఏప్రిల్ 13 (వార్తాప్రభ) :** ఇందు గలదు అందు లేదు అనే సందేహం లేదు ఏ సందు వెతికినా అందందే మారుమూల పల్లె ప్రాంతాల సైతం బెల్ట్ షాపులు ఉన్నాయని వాటితోపాటు ప్రత్యేక సిటింగు ఏర్పాట్లతో సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ సౌకర్యాన్ని స్వచ్ఛందంగా పొందే బెల్ట్ షాపు యజమానులు వేలాదిమంది ఉన్నారని ఎన్టీఆర్ జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి సిరసాని ప్రకాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ పరిపాలనలో బెల్ట్ షాపులు నిర్వహిస్తే బెండు తీస్తామని అన్నారని అదేవిధంగా రైతు రుణమాఫీ జరగటం లేదని ఆయన అన్నారు. అభివృద్ధి సంక్షేమం లేదని క్రింది స్థాయి నాయకులు పై స్థాయి నాయకుల ఆదేశాలను పాటించే పరిస్థితి కనబడటం లేదని తిరువూరు నియోజకవర్గంలో బెల్ట్ షాపులు ఉంటే తప్పేమిటి రాష్ట్రవ్యాప్తంగా ఉన్నాయి కదా అని అనే పరిస్థితి ఉండటం విచిత్రంగా ఉన్నదని ఆయన తెలిపారు. అప్పుల ఆంధ్ర ప్రదేశ్ గా రెండు సంవత్సరాల లోనే తెచ్చిన కోట్ల రూపాయల అప్పులు ఏం చేస్తున్నారో ఎవరికి అర్థం కావట్లేదు అన్నారు. ప్రజలకి సమాధానం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ..



**కాకినాడ,ఏప్రిల్ 13 (వార్తాప్రభ) :** జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ మొత్తం 31 ఫిర్యాదులను స్వీకరించారు. వాటిలో భూ తగాదాలు --10, కుటుంబ కలహాలు --11 మరియు ఇతర విభాగాలకు చెందినవి -- 10.వచ్చాయి.ఈ సందర్భంగా ఎస్పీ జి. బిందు మాధవ్ సంబంధిత అధికారులను ఆదేశిస్తూ, "ప్రతి ఫిర్యాదును నిశితంగా పరిశీలించి వాస్తవాలు నిర్ధారించగానే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, 7 రోజుల లోపు విచారణ పూర్తిచేసి తగిన పరిష్కారం చూపాలని, వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి సమర్పించాలని సూచించారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను విన్న ఎస్పీ ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడమే పోలీసుల ప్రధాన కర్తవ్యమని, ప్రజా సమస్యలను న్యాయపరంగా పరిష్కరించడంలో కాకినాడ జిల్లా పోలీసులు పూర్తి శ్రద్ధతో పని చేస్తున్నారని తెలిపారు.

## పేకాట శిబిరంపై పోలీసులు మెరుపు దాడి...

### దాడిలో పాల్గొన్న కృత్తి వెన్ను బంటుమిల్లి ఎస్ ఐ లు...



**కృత్తివెన్ను,ఏప్రిల్ 13 (వార్తాప్రభ) :** కృత్తివెన్ను మండలం పాశ్చాపురం గ్రామ పరిధిలో రహస్యంగా పేకాట నిర్వహిస్తున్నరని సమాచారం మేరకు బంటుమిల్లి ఎస్సై గణేష్ కుమార్ మరియు కృత్తివెన్ను ఎస్సై పైడి బాబు సోమవారం పేకాట శిబిరం పై దాడి చేశారు. ఈ దాడిలో 5 మందిని అదుపులో తీసుకుని వారి వద్ద నుండి 4 మొబైల్ ఫోన్లు, రూ. 87,000/- రూపాయల నగదును స్వాధీనం చేసుకుని గేమ్ యాక్ట్ చట్టం ప్రకారం వారిపై కేసులు నమోదు చేశారు. బంటుమిల్లి కృత్తివెన్ను మండలాలలో ఎలాంటి జోధా క్రీడలు ఆడిన, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ ఐ లు హెచ్చరించారు...

# ఆర్.జి-1 ఏరియాలో అభివృద్ధి పనుల జాతర!!

**జి.డి.కె. 2, 2ఏ గనులలో నూతన సౌకర్యాల ఆవిష్కరణ**

**సాంకేతిక నైపుణ్యానికి ప్రతీక మైనింగ్ మోడల్ ప్రదర్శన**

**జి.ఎం. లలిత్ కుమార్**

**పెద్దపల్లి/ గోదావరిఖని: ఏప్రిల్ 13 (వార్తాప్రభ ప్రతినిధి)** రామగుండం ఏరియా-1 పరిధిలోని జి.డి.కె. నెం. 2, 2ఏ ఇంక్లైన్ గనులలో సోమవారం నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాల్లో ఏరియా జనరల్ మేనేజర్ డి. లలిత్ కుమార్ పాల్గొన్నారు. గని అధికారుల ఘన స్వాగతం మధ్య జిడికె 2 ఇంక్లైన్ వద్ద దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం, ఉద్యోగుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన రెండో ఆర్.ఓ. వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అండర్ గ్రౌండ్ సెమీ మెకానైజ్డ్ మైనింగ్ మోడల్ ప్రదర్శనను ఆవిష్కరించడంతో పాటు గని ప్రాంగణంలోని నూతన ఉద్యానవనాన్ని రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. అనంతరం జిడికె 2ఏ గనిలో కొత్తగా నిర్మించిన 4వ స్యాండ్ బంకర్ను ఆయన జాతికి అంకితం చేశారు. మౌలిక సదుపాయాల కల్పన మరియు సాంకేతిక నైపుణ్యతను పెంచే దిశగా ఈ ప్రాజెక్టులు దోహదపడతాయని అధికారులు ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఓ.టు జి.ఎం. చంద్రశేఖర్, ఎఐటియుసి నాయకులు మడ్డి ఎల్లయ్య, పి.ఓ. రమేష్, వివిధ విభాగాల అధికారులు, యూనియన్ ప్రతినిధులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## వెలుగులు పంచే ముఖాల్లో ఆవేదన!!

**6వ రోజుకు చేరిన విద్యుత్ ఆర్టిజన్ల పోరాటం**

**న్యాయం కోసం నిరీక్షణ.. కన్వర్షన్ కోసం గర్జన**

**మద్దతుగా నిలిచిన రాజకీయ, కార్మిక సంఘాల నేతలు**



**పెద్దవల్లి/ గోదావరిఖని: ఏప్రిల్ 13 (వార్తాప్రభ ప్రతినిధి)** రామగుండం విద్యుత్ ఆర్టిజన్ల సమ్మె ఆరో రోజుకు చేరిన తరుణంలో, తమ కుటుంబాల భవిష్యత్తు కోసం ఆవేదనతో వారు చేస్తున్న పోరాటం అందరినీ కలిచివేస్తోంది. ఎన్నో ఏళ్లుగా కష్టపడుతున్న తమకు ఏపీ సెబ్ సర్వీస్ రూల్స్ అమలు చేసి కన్వర్షన్ కల్పించాలని, తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పెద్ద మనసుతో ఆలకించాలని వారు కన్నీటి పర్యంతమవుతూ వేడుకుంటున్నారు. రామగుండం సర్కిల్ కార్యాలయం వద్ద జరుగుతున్న ఈ దీక్షా శిబిరాన్ని సందర్శించిన బీజేపీ నాయకులు గోమాస శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ గంట రాములు యాదవ్, ఐఎఫ్టీయూ నేతలు ఇప్ప కృష్ణ, ఈదునూరి నరేష్ తదితరులు ఆర్టిజన్ల గోడును విని వారికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. చెమటోడ్చి రాష్ట్రానికి వెలుగులు నింపే తమ జీవితాల్లో చీకట్లు ముసురుతున్నాయని, ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి తమను ఆదుకోవాలని ఆర్టిజన్లు ఈ సందర్భంగా దీనంగా విన్నవించారు. ఈ పోరాటంలో కొంకటి శ్రీనివాస్, వడ్డేపల్లి సురేష్, ఆవుల మహేష్, దుర్గం విశ్వనాథ్, బోరే శ్రీనివాస్, ధర్మ నాయక్, జనార్దన్, సదయ్య, మహేందర్, పవన్ కుమార్, ఆరెపల్లి గణేష్, ప్రవీణ్ వంటి అనేక మంది కార్మికులు పాల్గొని తమ ఐక్యతను చాటారు.

## మౌనంలో మాధుర్యం!!




గంధపు చెక్కలా మనసు నిశ్శబ్దంగా ఉంటుంది,
చెక్కను కోసినప్పుడే సువాసన బయటపడుతుంది.
మనిషి లోపల ఉన్న విలువలు కూడా అలాగే,
పరిస్థితులు తాకితేనే పరిమళం తెలుస్తుంది!!
మౌనంలో ముడిచిన మాటలు ఎంతో ఉంటాయి,
వెలిబుచ్చినప్పుడు అవే భావాలుగా మారుతాయి.
ప్రహసనం అంతా ఆనందంగా కనిపించినా,
లోపల ఒక కథ నిశ్శబ్దంగా నడుస్తుంటుంది!!
బాధలు మనసులో బరువై నిలిచినా,
కాలం వాటిని తేలిక చేస్తుంది నెమ్మదిగా.
ఓటమి వచ్చినా అది ముగింపు కాదు,
అదే విజయానికి తొలి మెట్టు అవుతుంది!!
మనసు గాయపడినా ఆశలు మాయవు,
అవి కొత్త మార్గాలు చూపిస్తాయి.
నిశ్శబ్దంలోనే నిజమైన శక్తి దాగి ఉంటుంది,
ఆ శక్తి మనల్ని ముందుకు నడిపిస్తుంది!!
బయట ప్రపంచం ఎంత కలవరంగా ఉన్నా,
లోపల ప్రశాంతతే నిజమైన ధనం.
మనసు వెలుగుతో మార్గం కనపడుతుంది,
అదే జీవితం అనే ప్రయాణానికి దీపం!!

**గడ్డం సంతోష్ రాజ్**

గోదావరిఖని, 9849555485

# ప్రజా సేవలు నిలిచిపోతే ప్రభుత్వ పతనం ఖాయం!!

**♦మొద్దునిద్ర వీడండి.. లేదంటే గద్దె దించుతాం ♦తహసీల్దార్ కార్యాలయం మూసివేత ఎమ్మెల్యే అసమర్థతనే ♦సచివాలయం ముట్టడికి సిద్ధం.. తక్షణమే కార్యాలయం తెరవాలి ♦బీఆర్ఎస్ నాయకులు కౌశిక హరి**





**పెద్దవల్లి/ గోదావరిఖని: ఏప్రిల్ 13 (వార్తాప్రభ ప్రతినిధి)** రామగుండం తహసీల్దారు కార్యాలయాన్ని మూసివేసి సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం కాంగ్రెస్ ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనమని, ప్రజా సేవలను తక్షణమే పునరుద్ధరించకపోతే ప్రభుత్వం పతనం ఖాయమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కౌశిక హరి తీవ్రస్థాయిలో హెచ్చరించారు. పాలనను గాలికి వదిలేసి ప్రజల అవసరాలను పట్టించుకోని ఈ వైఖరిని సహించేది లేదని, కార్యాలయం మూసివేత వల్ల వెనకబడిన వర్గాలు, రైతులు పడుతున్న ఇబ్బందులపై ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన డిమాండ్ చేశారు. తక్షణమే ఎమ్మెల్యే, ప్రభుత్వం స్పందించి కార్యాలయాన్ని తెరవకపోతే రామగుండం గడ్డపై ప్రజా ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని, వేలాది మందితో సచివాలయాన్ని ముట్టడించడానికి కూడా వెనుకాడబోమని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకులు తమ మొద్దునిద్ర వీడి ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, లేనిపక్షంలో ఊరూరా ఉద్యమాలను ఉధృతం చేసి ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు విశ్రమించేది లేదని కౌశిక హరి ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన పోరాడుతుందని, అధికారులు, పాలకులు తమ బాధ్యతారాహిత్యాన్ని వీడకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆయన హెచ్చరికలు జారీ చేశారు.

# పెన్షన్ పెరగదు..... బతుకులు మారవు!!

**■ సింగరేణి నాటి రిటైర్డ్ కార్మికుల ఆర్థిక గోస ■ అత్యంత కష్ట కాలంలో పని చేసిన వారికి గుర్తింపు నిల్ ■ పని భారం ఎక్కువ ఉన్న భరించింది అప్పటి కార్మికులే ■ పెన్షన్ పెంపుదలలో ఎందుకు ఇంత వివక్ష..... కాలం సాగదీత ■ సింగరేణి రిటైర్డ్ కార్మికుల కన్నీటి గాథ ■ చెమట చిందించిన బతుకులకు 'చిల్లర' కష్టాలేనా?**







**పెద్దవల్లి/ గోదావరిఖని: ఏప్రిల్ 13 (వార్తాప్రభ ప్రతినిధి)** భూగర్భంలో ప్రాణాలకు తెగించి, చీకటి గదుల్లో వెలుగులు నింపిన చేతులు నేడు ఆకలితో వణుకుతున్నాయి. సింగరేణిని 'సిరుల తల్లి'గా మార్చిన నాటి కార్మికుల జీవితాలు నేడు చితికిపోతున్నాయి. పెరిగిన ధరలు, ముసిరిన రోగాల మధ్య వారి పెన్షన్ 'పైసా' కూడా పెరగక, బతుకు బండి భారంగా సాగుతోంది.

**నాడు చెమట చుక్క.. నేడు కన్నీటి చుక్క** నాడు యంత్రాలు లేని కాలంలో, కేవలం మనిషి శ్రమనే నమ్ముకుని, వేల అడుగుల లోతులో బొగ్గును వెలికితీసిన ఘనత నాటి రిటైర్డ్ కార్మికులది. పని భారం విపరీతంగా ఉన్నా, ప్రాణాలకు గ్యారెంటీ లేని పరిస్థితుల్లోనూ వెనుకాడకుండా పనిచేశారు. వారి కష్టం సింగరేణికి లాభాల పంట పండించింది కానీ, వారి రిటైర్మెంట్ జీవితంలో మాత్రం ఆ వెలుగులు నిండలేదు.

**పెన్షన్ పెరగదు.. బతుకులు మారవు** నేడు చాలా మంది రిటైర్డ్ కార్మికులకు వస్తున్న పెన్షన్ కేవలం రూ500 నుండి రూ2000 మధ్యే ఉంటోంది. ఈ అరకొర సొమ్ముతో నేటి కాలంలో ఒక్క పూట గడవడమే కష్టంగా మారింది.

**వివక్ష ఎందుకు?** కొత్తగా రిటైర్ అయ్యే వారికి వచ్చే సదుపాయాలు, పాత తరం కార్మికులకు అందకపోవడం వారిని మానసికంగా కుంగదీస్తోంది.

**కాలయాపన** పెన్షన్ పెంపుదలపై ఎన్నో ఏళ్లుగా హామీలు వస్తున్నా, ఆచరణలో మాత్రం శూన్యం. కమిటీలు, చర్చల పేరుతో కాలం సాగదీయడమే తప్ప, వృద్ధాప్యంలో ఉన్న తమ గోడు వినేవారే లేరని వారు ఆవేదన చెందుతున్నారు.

"మేము బొగ్గు గనిలో పని చేసినప్పుడు సూర్యుడిని చూడలేదు.. ఇప్పుడు ముసలితనంలో సుఖాన్ని చూడలేకపోతున్నాం."

ఒక విశ్రాంత కార్మికుడి ఆవేదన

**గుర్తింపు నిల్.. గౌరవం నిల్** అత్యంత కష్టకాలంలో సంస్థను అంటిపెట్టుకుని ఉన్నవారికి కనీస గుర్తింపు కూడా దక్కడం లేదు. ఆసుపత్రి ఖర్చులకే పెన్షన్ డబ్బులు సరిపోని దుస్థితి. వారసత్వ ఉద్యోగాల కోసం, కనీస పెన్షన్ పెంపు కోసం వారు చేస్తున్న పోరాటం అరణ్య రోదనగానే మిగిలిపోతోంది.

**సర్కారుకు వినిపించని గుండెకోత** సింగరేణి లాభాల్లో వాటాలు పంచే ప్రభుత్వాలు, ఆ లాభాల కోసం తమ జీవితాలను ధారపోసిన ఈ పాతతరం కార్మికులను ఎందుకు విస్మరిస్తున్నాయి? పెన్షన్ పెరగక, బతుకులు మారక.. వారు కనుమూసే లోపలైనా ప్రభుత్వం కళ్లు తెరవాలి. వారు కోరుతున్నది విలాసవంతమైన జీవితం కాదు, కనీస ఆత్మగౌరవంతో కూడిన జీవనం. కార్మికుడి చెమట తడి ఆరకముందే కూలి ఇవ్వాలంటారు.. మరి జీవితాంతం కష్టపడ్డ వృద్ధ కార్మికుడికి న్యాయం ఎప్పుడు జరుగుతుంది?....

# శ్రీపాద రావు ఆశయ సాధనే లక్ష్యం!!

**ప్రజా నేత స్మరణలో రామగుండం**

**ఆశయమే స్ఫూర్తి.. సేవయే మార్గం**

**ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**



**పెద్దపల్లి/ గోదావరిఖని: ఏప్రిల్ 13 (వార్తాప్రభ ప్రతినిధి)** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ శాసనసభ స్పీకర్ దుద్దిల్ల శ్రీపాద రావు 27వ వర్ధంతి వేడుకలు గోదావరిఖనిలో స్మరణీయంగా సాగాయి. స్థానిక బస్టాండ్ ఎదురుగా ఉన్న శ్రీపాద రావు విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు బొంతల రాజేష్ నేతృత్వంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ హాజరై, విగ్రహానికి పూలమాలలు వేసి నినదించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, స్వయంగా ప్రజలకు భోజనం వడ్డించి తన ఉదారతను చాటుకున్నారు. ఈ సందర్భంగా రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ, ప్రజాసేవలో శ్రీపాద రావు చేసిన విశేష కృషిని కొనియాడుతూ, ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. శ్రీపాద రావు జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ అన్నదానానికి సామాన్య ప్రజల నుండి విశేష స్పందన లభించింది. ప్రజా నాయకుడి పట్ల ఉన్న గౌరవంతో కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. శ్రీపాద రావు సేవలు చిరస్మరణీయమని, ఆయన చూపిన బాటలోనే తాము నడుస్తామని నాయకులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు భారీ సంఖ్యలో పాల్గొని నివాళులర్పించారు.



# ప్రజలందరికీ భాగస్వామ్యంతోనే కాలనీల అభివృద్ధి.

**కాలనీ వాసుల సొంత నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు. - మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్.**



**జవహర్ నగర్, ఏప్రిల్ 13: (వార్తాప్రభ)** ప్రజలందరికీ భాగస్వామ్యంతోనే ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ప్రగతిలో ప్రతి పనికి ప్రభుత్వంపై ఆధారపడకుండా ప్రజలందరి భాగస్వామ్యంతో సొంత నిధులతో అభివృద్ధి చెందవచ్చునని జవహర్ నగర్ మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్ తెలిపారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ చంద్రపురి కాలనీలోని ముత్తుస్వామి కాలనీలో కాలనీవాసుల సహకారంతో సోమవారం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ నిహారిక గౌడ్ తో కలిపి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధిలో ప్రభుత్వ సహకారంతో పాటు ప్రజల భాగస్వామ్యం ఉన్నప్పుడే ఆ ప్రాంతం త్వరగా అభివృద్ధి చెందుతుందని అభివృద్ధిలో అందరూ మమేకమైనప్పుడే అభివృద్ధిలో ముందడుగు వేస్తామని తెలిపారు. ఈ గొప్ప కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ నిహారిక గౌడ్ రూ. 75000 ఆర్థిక సహాయం అందించడం అభినందనీయ మనీ అలాగే తమ వంతు సహాయంగా రచన స్కూల్ ప్రిన్సిపల్ శ్రీకాంత్ రెడ్డి ఆర్థిక సహకారం తోపాటు కాలనీలోని ప్రజలందరూ కొంత మొత్తం వేసుకొని ఈ మహత్కర కార్యాన్ని చేపట్టడం శుభ సూచకమన్నారు. ప్రాంతాలు అభివృద్ధి చెందినప్పుడే ఊరు అభివృద్ధి చెందుతుందని తద్వారా దేశం పురోగాభివృద్ధిలో ముందుకు పయనిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సామాజిక సేవకుడు బూడిద వెంకటేష్, మహేందర్ యాదవ్, భాస్కర్ గౌడ్, అనిల్ ముదిరాజ్, కిషోర్, కిరణ్, రవి, కర్ణాకర్, వంశీ, విజయ్ ,రాజు పటాన్, రాము, భరత్ ,రాములమ్మ, యాదలక్ష్మి, నాగమణి, శకుంతల కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



# రహదారి భద్రత - జీవన భద్రత!!

**ప్రాణం విలువ తెలుసుకుందాం**

**సురక్షితంగా ఇంటికి చేరుదాం**

**ఆర్టీసీ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై ర్యాలీ**

**పెద్దవల్లి/ గోదావరిఖని: ఏప్రిల్ 13 (వార్తాప్రభ ప్రతినిధి)** ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా "అరైవ్- అలైవ్" నినాదంతో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు గోదావరిఖనిలో ఆర్టీసీ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో భారీ ర్యాలీని అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. సోమవారం గోదావరిఖని డిపో నుండి ప్రారంభమైన ఈ యాత్ర బస్టాండ్ ప్రాంగణం, మున్సిపల్ ఆఫీస్, రాజేష్ సర్కిల్ మీదుగా తిరిగి డిపో వరకు సాగి, ప్రజల్లో ట్రాఫిక్ నియమాలపై చైతన్యాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో రామగుండం ఎంవీఐ కె. సంతోష్ రెడ్డి, ఏఎంవీఐ ప్రదీప్ సాగర్, డిపో మేనేజర్ ఎం.నాగభూషణం, ట్రాఫిక్ ఎస్ఐ హరి శేఖర్ ముఖ్య అతిథులుగా పాల్గొని, రహదారిపై ప్రయాణించేటప్పుడు పాటించాల్సిన భద్రతా సూత్రాలను వివరించారు. అసిస్టెంట్ మేనేజర్ కె. గీతాకృష్ణ, ఏఈ సంధ్యారాణి, ట్రాఫిక్ సూపర్ వైజర్ పి. లింగయ్యతో పాటు సుమారు 100 మంది సిబ్బంది ఈ ప్రదర్శనలో భాగస్వాములై విజయవంతం చేశారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, అతివేగం ప్రమాదకరమని అధికారులు ఈ సందర్భంగా హెచ్చరిస్తూ, క్రమశిక్షణతో కూడిన డ్రైవింగ్ ద్వారానే ప్రాణాలను కాపాడుకోగలమని సందేశాన్ని ఇచ్చారు. ఈ వినూత్న అవగాహన యాత్ర గోదావరిఖని వీధుల్లో రోడ్డు భద్రతపై సరికొత్త స్ఫూర్తిని రగిలించింది.

# ఎన్టీపీసీలో అత్యాధునిక ఫైర్ టెండర్ షురూ!!

**♦"సిఐఎస్ఎఫ్"లో చేరిన కొత్త అగ్నిమాపక వాహనం ♦బలోపేతమైన భద్రతా వ్యవస్థ ♦సమర్థవంతమైన విపత్తు నిర్వహణ ♦ఈడి చందన్ కుమార్ సమంత**



**పెద్దపల్లి/ ఎన్టీపీసీ: ఏప్రిల్ 13 (వార్తాప్రభ ప్రతినిధి)** రామగుండం ఎన్టీపీసీ సిఐఎస్ఎఫ్ విభాగంలో అగ్నిమాపక సేవల బలోపేతానికి గాను సోమవారం నూతనంగా ఒక ఫైర్ టెండర్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్ కుమార్ సమంత ముఖ్య అతిథిగా విచ్చేసి సిఐఎస్ఎఫ్ యూనిట్ కమాండెంట్ నవనీత్ కౌర్ సమక్షంలో ఈ నూతన అగ్నిమాపక వాహనాన్ని లాంఛనంగా ప్రారంభించారు. పరిశ్రమ ఆవరణలో అగ్ని ప్రమాదాల నివారణకు, అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ఈ ఆధునిక ఫైర్ టెండర్ ఎంతగానో ఉపయోగపడుతుందని అధికారులు ఈ సందర్భంగా వెల్లడించారు. ప్లాంట్ భద్రతా మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయడంలో భాగంగానే ఈ వాహనాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని, ఇది అత్యవసర సమయాల్లో వేగంగా స్పందించేందుకు వీలు కల్పిస్తుందని వారు తెలిపారు. ఎన్టీపీసీ యాజమాన్యం తమ ఉద్యోగుల, ప్లాంట్ రక్షణ కోసం నిరంతరం అత్యున్నత భద్రతా ప్రమాణాలను పాటిస్తుందని ఈ చొరవ వారి అంకితభావానికి నిదర్శనమని అధికారులు వివరించారు. ఈ నూతన అగ్నిమాపక వాహనం రాకతో రామగుండం ఎన్టీపీసీ ప్రాంతంలో అగ్నిమాపక విభాగానికి మరింత చేవ చేకూరినట్లయింది. ఈ కార్యక్రమంలో సిఐఎస్ఎఫ్, ఎన్టీపీసీ ఉన్నతాధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**కూకట్ పల్లి,ఏప్రిల్13(వార్తాప్రభ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రామవరం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1989-1990 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు 35 సంవత్సరాల తర్వాత ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి సుమారు 60 మంది పూర్వ విద్యార్థులు హాజరై ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన బయాలజీ ఉపాధ్యాయులు రామారావు, గణిత ఉపాధ్యాయులు వెంకట్ రెడ్డిని పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించారు. అలాగే వారికి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి పూర్వ విద్యార్థికి కూడా మెమెంటోలు బహుకరించారు. అనంతరం విద్యార్థులు తమ పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమంలో సదానందం, శ్రీహరి, సమ్మయ్య, జెసి వెంకట్ రెడ్డి, సీఐ బాలాజీ, శ్రీను, స్వరూప, ఎడ్ల కవిత, భాగ్య తదితర పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



# ఎడిటోరియల్

## కాల్పుల విరమణ వేళ హర్మూజ్ లాభం ఎవరికి?

ఇరాన్ - అమెరికా మధ్య జరుగుతున్న యుద్ధానికి కాస్త విరామం ఇస్తూ కాల్పుల విరమణ జరగటం తెలిసిందే. ఇందులో భాగంగా పాక్ లోని ఇస్లామాబాద్ వేదికగా చర్చలు జరగటం.. చివరకు అవి కాస్తా ఫెయిల్ కావటం తెలిసిందే. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మళ్లీ తన ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. హర్మూజ్ మీద నియంత్రణను ఇరాన్ వదలని పక్షంలో మళ్లీ దాడులు తప్పవని హెచ్చరిస్తున్నారు. తాజా పరిణామాలతో మళ్లీ యుద్ధ భయాలు రెట్టింపు అయ్యాయి. ఇందుకు తగ్గట్లే సెన్సెక్స్ దారుణంగా పడిపోవటం తెలిసిందే. కాల్పుల విరమణ వేళ.. హర్మూజ్ జలసంధి వద్ద దాదాపు 800పైగా నౌకలు ఉండటం తెలిసిందే. వీటిల్లో ఎన్ని నౌకలు జలసంధిని విజయవంతంగా దాటాయి? అందులో భారత్ కు చెందిన నౌకలు ఎన్ని? కాల్పుల విరమణ.. ఏ దేశానికి ఎక్కువ మేలు చేసింది? లాంటి అంశాల్ని చూసినప్పుడు ఆసక్తికర అంశాలు కనిపిస్తాయి. ప్రస్తుతం అక్కడ 800కంటే ఎక్కువ నౌకలు చిక్కుకొని ఉన్నాయి. వీటిల్లో 426 ఆయిల్ ట్యాంకర్లు.. 34 ఎల్పీజీ క్యారియరర్లు.. 19 ఎల్ ఎన్ జీ వెసెల్స్ ఉన్నట్లుగా చెబుతున్నారు. తాజాగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏప్రిల్ 13 నుంచి ఇరాన్ ఓడరేవులపై పూర్తి బ్లాక్ డే విధిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఇప్పటికే పరిమితంగా సాగుతున్న రాకపోకలన్ని దాదాపు నిలిచిపోయే ప్రమాదం ఉంది. కాల్పుల విరమణ (ఏప్రిల్ 8) నుంచి ఏప్రిల్ 12 వరకు రాకపోకలు సాధారణ స్థాయి కంటే చాలా తక్కువగానే సాగాయి. పలు రిపోర్టులను కూర్చి చూస్తే.. ఏప్రిల్ 8 నుంచి ఆదివారం (ఏప్రిల్ 12) వరకు కేవలం 19-30 నౌకలు మాత్రమే జలసంధిని దాటినట్లుగా చెప్పాలి. కాల్పుల విరమణ తర్వాత ఈ జలసంధిని దాటిన మొదటి భారతీయ నౌక జగ్ విక్రమ్ రికార్డును క్రియేట్ చేసింది. కాల్పుల విమరణతో లభించిన అవకాశం భారత్ సద్వినియోగం చేసుకుందని చెప్పాలి. విరమణ వేళ..జలసంధిని దాటిన ఎక్కువ నౌకలు భారత్ వే కావటం గమనార్హం. భారత్ తర్వాత చైనాకు చెందిన నౌకలు (3-9) మధ్య జలసంధిని దాటాయి. ఆ తర్వాతి స్థానంలో రష్యా నౌకలు ఉ న్నాయి. అమెరికాకు చెందిన రెండు యుద్ధ నౌకలు కూడా మైన్ క్లియరింగ్ లో భాగంగా జలసంధిని దాటాయి. పాక్ కు చెందిన ఒక ట్యాంకర్ సురక్షితంగా జలసంధిని దాటింది. గ్రీస్ దేశానికి చెందిన నౌక కూడా జలసంధిని దాటింది. సాధారణ రోజుల్లో ఈ జలసంధిని రోజుకు 138 నౌకలు దాటుతుంటే.. ఇప్పుడు 5-7 నౌకలు మాత్రమే దాటే పరిస్థితి ఇదంతా చూసినప్పుడు కాల్పుల విరమణ భారత్ కు మేలు చేసిందని చెప్పాలి. దీంతో ముడిచమురు.. గ్యాస్ నౌకలు భారత్ కు చేరటం ద్వారా.. ఇప్పటికి ఉన్న ఒత్తిడిని కొంత మేర తగ్గించే వీలుంది. గృహావసరాలకు వాడే సిలిండర్లు, వాహనాల గ్యాస్ సరఫరాలో కొరత కొంతమేర తగ్గే అవకాశం ఉంది. గ్యాస్ కొరత కారణంగా ఎరువుల కర్మాగారాలకు నిలిచిపోయిన గ్యాస్ సరఫరా ఇప్పుడు 95 శాతం వరకు పునరుద్ధరించే అవకాశం ఉంది. విశ్వసనీయ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం ప్రస్తుతం హర్మూజ్ జలసంధి వద్ద భారత్కు చెందిన 37 నౌకలు చిక్కుకొని ఉన్నాయి. అవి కూడా వస్తే.. మన పరిస్థితి మరింత మెరుగు అవుతుందని చెప్పాలి.

## హోలి పెంతెకోస్తు చర్చి నిర్మాణానికి కోగంటి సత్యం వితరణ



**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 13(వార్తా ప్రభ ప్రతినిధి):**కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కొత్త గేటు వద్ద పునః నిర్మితమవుతున్న హోలి పెంతెకోస్తు చర్చి నిర్మాణానికి ప్రముఖ పారిశ్రామికవేత్త కోగంటి సత్యం నిర్మాణానికి అవసరమైన ఇనుమును వితరణ చేశారు. చర్చి పాస్టర్ కే జయ బాబు విజ్ఞప్తి మేరకు స్లాబ్ నిర్మాణానికి అవసరమైనటువంటి సుమారు 1 లక్ష 65 వేల రూపాయలు ఇనుమును వితరణగా ఇచ్చారు. చర్చ్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న సూఫీ మత గురువులు అల్తాఫ్ బాబా చర్చి నిర్మాణానికి సహకారం అందించాలని కోగంటి సత్యం కు విజ్ఞప్తి చేశారు. దీంతో స్పందించిన కోగంటి సత్యం సోమవారం నాడు చర్చి పాస్టర్ ను కలిసి ఇనుమును అందించారు.తనకు కుల మతాలకు అతీతంగా అందరితో అనుబంధాలు ఉన్నాయని, ఆయా సంస్థల అభివృద్ధికి తన వంతు చేతనైన సహాయం ఎల్లప్పుడూ అందిస్తానని ఈ సందర్భంగా సత్యం తెలిపారు. ఈ సందర్భంగా ఫాస్టర్ జయ బాబు మరియు సంఘస్తులు కోగంటి సత్యం మరియు అల్తాఫ్ బాబా కు ప్రభు ఆశీస్సులు ఉండాలని, ధన్యవాదాలు తెలిపారు.

## జవాబు పత్రాల మూల్యాంకన కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్.

**మచిలీపట్నం ఏప్రిల్ 13 (వార్తాప్రభ ప్రతినిధి)** కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని లేడీ యాంప్తిల్ గవర్నమెంట్ హై స్కూల్లో ఎనిమిదవ రోజు (శ్రేష్ఠ ఋు౦) నిర్వహించబడుతున్న పదవ తరగతి పరీక్షా జవాబు పత్రాల మూల్యాంకన కేంద్రాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మూల్యాంకన ప్రక్రియను పరిశీలించి, నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మూల్యాంకన కార్యక్రమంలో మొత్తం 775 మంది సిబ్బంది పాల్గొంటున్నారు. ఇందులో 80 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 461 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు , 234 మంది ఇతర సిబ్బంది ఉన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి యు.వి. సుబ్బారావు ఇతర అధికారులు కూడా పాల్గొన్నారు.



## పేదలకు అన్నసమారాధన చేస్తున్న ట్రస్ట్ అధ్యక్షుడు కళ్ళే నాగేశ్వరరావు...

**●పేదలకు సేవే పరమావధి..●కళ్ళే లలిత వీధిలో 53నెలలు నుండి ప్రతి నెల అన్నసమారాధన ●ట్రస్ట్ అధ్యక్షుడు కళ్ళే నాగేశ్వరరావు**



**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పేదలకు సేవచేయడమే పరమావధి అని కళ్ళే లలిత ట్రస్ట్ అధ్యక్షుడు కళ్ళే నాగేశ్వరరావు అన్నారు.అజిత్ సింగ్ నగర్కళ్ళే లలిత వీధిలో గత 53నెలలు నుండి ప్రతి నెల పేదలకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.ఇందులో భాగంగానే ఆదివారం పేదలకు అన్నసమారాధన నిర్వహించారు.ఈ సందర్భంగా కళ్ళే లలిత ట్రస్ట్ అధ్యక్షుడు కళ్ళే నాగేశ్వరరావు పాల్గొని స్వర్గీయ కళ్ళే లలిత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు అన్నదానం నిర్వహించారు.సింగ్ నగర్ ప్రాంతంలో స్వర్గీయ కళ్ళే లలిత జ్ఞాపకార్థం, కళ్ళే లలిత వీధిలో ప్రతి నెల అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని,ట్రస్ట్ డైరెక్టర్లు సేవలు ఎనలేనిదని అన్నారు.స్వర్గీయ కళ్ళే లలిత భౌతికంగా దూరమైన నాటి నుండి ప్రతి నెల 12వ తేదిన క్రమం తప్పకుండా గత 53నెలలు నుండి పేదలకు సింగ్ నగర్ ప్రాంతంలోని కళ్ళే లలిత వీధి వద్ద అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. తమకు కలిగిన ఆర్థిక స్థోమత బట్టి పేదలకు ఆహారాన్ని అందజేయడం జరుగుతుందని అన్నారు.కళ్ళే లలిత బ్రతికి ఉన్న రోజులలో పేదల ఆకలి తీర్చాలని తెలపడం జరిగిందని అందుకే ప్రతి నెల వారికి బోజనాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని కళ్ళే నాగేశ్వరరావు అన్నారు.రానున్న రోజులలో కళ్ళే లలిత ట్రస్ట్ సేవలు ద్వారా పేదలకు మరింత సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు.ఈకార్యక్రమంలో డైరెక్టర్లు కళ్ళే సీతా మహాలక్ష్మిముప్పూరి హరీష్, ఎమ్.జశ్విన్,జి. ధ్రువన్,చందన సురేష్,ప్రసాద్ స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

**.. ఫ్యూరీ ఫైడ్ వాటర్..**ఎండ, చలి, వాన అనే కాలాలు లేకుండా 365రోజులు (సంవత్సరం) పాటు పాదచారుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని ట్రస్ట్ అధ్యక్షుడు కళ్ళే నాగేశ్వరరావు అన్నారు.శుద్ధి చేసిన ఫ్యూరి ఫైడ్ నీటిని పాదాచారులకు అందజేస్తున్నామని అన్నారు.

## సేంద్రియ కూరగాయలతో ఆరోగ్యమైన హ్యాపీ సండే



**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ నగరపాలక సంస్థ సౌజన్యంతో వన్ ఎర్త్-వన్ లైఫ్ తరపున హ్యాపీ సండే లో భాగంగా "ఫార్మర్ టు కన్జ్యూమర్ " కార్యక్రమం నగర ప్రజలకు ఒక ఆరోగ్యకరమైన మార్గదర్శకంగా నిలవాలని ఉద్దేశంతో ఆదివారం ఉదయం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం రసాయన రహిత (ఆర్గానిక్) కూరగాయలను నేరుగా రైతుల నుండి వినియోగదారులకు అందించడం. మధ్యవర్తులు లేకుండా, రైతులకు సరైన ధర అందిస్తూ, వినియోగదారులకు తాజా, నాణ్యమైన మరియు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడం ఈ కార్యక్రమం లక్ష్యం.ఈరోజుల్లో రసాయనాలతో పండించిన ఆహారం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయి. అలాంటి పరిస్థితుల్లో సహజ పద్ధతుల్లో పండించిన కూరగాయలను తీసుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన పోషకాలు అందడమే కాకుండా, వ్యాధి నిరోధక శక్తి కూడా పెరుగుతుంది."ఆహారమే ఔషధం" అనే భావనను ప్రతి ఒక్కరికి చేరవేయడమే మా సంకల్పం. అదేవిధంగా, చిన్న మరియు సన్న రైతులను ప్రోత్సహించడం ఈ కార్యక్రమంలో ముఖ్య భాగం. రైతు కష్టం విలువైనదిగా గుర్తిస్తూ, వారికి నేరుగా మార్కెట్ అవకాశాలు కల్పించడం ద్వారా వారి ఆర్థిక స్థితి మెరుగుపడుతుంది.వన్ ఎర్త్-వన్ లైఫ్

(టెర్రస్ గార్డెన్) తరపున నగర ప్రజలను మిద్దె తోటల వైపు ప్రోత్సహించడంలో కూడా ఈ కార్యక్రమం ఒక ముఖ్యమైన అడుగు. ప్రతి ఇంట్లో ఒక చిన్న తోట ఉంటే, కుటుంబానికి అవసరమైన కూరగాయలను స్వయంగా పండించుకోవచ్చు. ఇది ఆరోగ్యాన్ని కాపాడటమే కాకుండా ప్రకృతికి దగ్గరగా జీవించే అవకాశాన్ని ఇస్తుంది.ఆదివారం ఉదయం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమానికి నగర ప్రజలు మంచి స్పందన తెలిపారు. రైతులు తీసుకొచ్చిన ఆర్గానిక్ కూరగాయలను ప్రజలు ఆసక్తిగా కొనుగోలు చేశారు.ఈ సందర్భంగా గ్రూప్ అడ్మిన్ లీలా కుమారి మాట్లాడుతూ,రసాయన రహిత ఆహారం తీసుకోవడం ప్రతి కుటుంబానికి ఎంతో అవసరమని, మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని తెలిపారు. చిన్న స్థలంలో కూడా మిద్దె తోటలను ఏర్పాటు చేసుకొని స్వయంగా కూరగాయలు పండించుకోవాలని, పిల్లలకు కూడా ప్రకృతి మీద ప్రేమ పెంచాలని సూచించారు. అలాగే రైతులకు నేరుగా మద్దతు ఇవ్వడం ద్వారా సమాజం ఆరోగ్యవంతంగా మారుతుందని వివరించారు. ప్రకృతికి దగ్గరగా జీవించాలని కోరుకునే ప్రతి ఒక్కరూ తప్పక ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనాలి."రైతుకు మద్దతు -- మన ఆరోగ్యానికి భరోసా" అనే నినాదంతో ముందుకు సాగుదాం.ఈ కార్యక్రమంలో గ్రూప్ అడ్మిన్ విజయ్, మద్దిరాల కమలాకరరావు, కె.హారతి, రాజేశ్వరి, వసంత, తూనుగుంట్ల శేఖర్, వెంకటేష్ మరియు రైతులు పాల్గొన్నారు.

## వైభవంగా కొండపల్లి శ్రీ షిరిడి సాయి బాబా మొదటి వార్షికోత్సవం

**సాయిబాబా ను దర్శించుకున్న మాజీమంత్రి జోగి రమేష్, కోగంటి సత్యం, ఆశా కిరణ్**





**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 13(వార్తా ప్రభ ప్రతినిధి):**కొండపల్లి బి.కాలనీలో ఉన్న శ్రీ షిరిడి సాయిబాబా మందిరం మొదటి వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. వార్షికోత్సవ సందర్భంగా మాజీ మంత్రి మైలవరం నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఇంచార్జ్ జోగి రమేష్, ప్రముఖ పారిశ్రామికవేత్త కోగంటి సత్యం మరియు వంగవీటి మోహన రంగా కుమార్తె ఆశా కిరణ్ అల్తాఫ్ బాబా తో కలిసి పాల్గొన్నారు. సాయిబాబా వద్ద ప్రత్యేక పూజలు, హారతి లో పాల్గొని బాబా ఆశీస్సులు పొందారు. అనంతరం గుడి ధర్మకర్త పామర్తి రాంబాబు వారికి బాబా వారి కండువా, చిత్రపటం లో ఘనంగా సత్కరించి ఆశీర్వచనం ప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని జోగి రమేష్, ఆశా కిరణ్, కోగంటి సత్యం, అల్తాఫ్ బాబా సంయుక్తంగా ప్రారంభించి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా బాబా వారి ఆశీస్సులతో సర్వమానవాళికి. మంచి జరగాలని, ప్రజలందరూ సోదర భావంతో మెలగాలని ఆకాంక్షించారు.

## ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో పరిశీలించి శాశ్వత పరిష్కారం అందించాలి



**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చే ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో పరిశీలించి శాశ్వతమైన పరిష్కారాన్ని అందించాలని విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ అన్నారు. సోమవారం ఉదయం ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్ లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చే ప్రతి ఫిర్యాదును అధికారులు అందరూ క్షేత్రస్థాయిలో పరిశీలించి శాశ్వతమైన పరిష్కారాన్ని అందించాలని ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా వారికి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చే సమస్యను వారు ఎలా పరిష్కరిస్తున్నారు వంటి అంశాలు ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించాలని, సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారాన్ని అందించాలని అన్నారు.ఈ సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలు మొత్తం 17 ఫిర్యాదులు అందగా అందులో పట్టిన ప్రణాళిక సంబంధించినవి 7, ప్రజారోగ్యం 2 ఇంజనీరింగ్ 5, రెవెన్యూ విభాగం 1, హార్టికల్చర్ 2. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఏ. రవీంద్రరావు, చీఫ్ సిటీ ప్లానర్ కె.సంజయ్ రత్నకుమార్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, చీఫ్ ఇంజనీర్ ఇంచార్జ్ పి. సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) సృజన, సూపరిండెంటింగ్ ఇంజనీర్ (వర్క్స్) వి.చంద్రశేఖర్, ఎస్టేట్ ఆఫీసర్ ఎ. శ్రీధర్, డిప్యూటీ డైరెక్టర్ (హార్టికల్చర్)చంద్రశేఖర్, ఆర్ ఎఫ్ ఓ మల్యాద్రి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు గోపాలకృష్ణ, వి ఏ ఎస్ డి.హరీష్, బయాలజిస్ట్ వి. కామేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రాంగణ నియామకాల్లో కెబిఎన్ ప్రతిభ



**విజయవాడ పశ్చిమ, ఏప్రిల్ 13:(వార్తా ప్రభ ప్రతినిధి)**రాత పరీక్ష, ఇంటర్వ్యూల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రూ. 10 లక్షల వార్షిక వేతనంతో ప్రాంగణ ఎంపికల్లో ప్రముఖ ఐ.టి. సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కె.బి.ఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి చెప్పారు. సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆమె మాట్లాడుతూ బెంగళూరుకు చెందిన ప్రముఖ ఐ.టి సంస్థ లెర్న్ ఫ్లూ ఎడ్యుటెక్ ప్రైవేట్ లిమిటెడ్ (LearnFlu Edutech Pvt. Ltd) నిర్వహించిన ఎంపికల్లో తమ ఎం.బి.ఎ విద్యార్థులు జె.రవికిరణ్, మొవ్వ రిషిత; ఎం.సి.ఎ విద్యార్థులు లిఖిత చలపతి, వై. ఓంసాయి మణికంఠ రూ. 10 లక్షల వార్షిక వేతనంతో ఎంపికైనట్లు చెప్పారు. ఇదే కంపెనీకి ఎస్.నరేంద్ర బాబు, రెడ్డి దుర్గా ప్రసన్న, సింహాద్రి లక్ష్మీ సాత్విక, ఎస్. లోకేష్ రూ. 8 లక్షల వేతనంతో ఎంపికైనట్లు చెప్పారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ టి.శ్రీనివాసు, పి.జి కోర్సెస్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.వేంకటేష్, ప్లేస్ మెంట్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి తదితరులు విద్యార్థులను అభినందించారు.

## జి.కొండూరులో ఘనంగా శ్రీ కార్యసిద్ధి దాస ఆంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ట

**వేడుకలలో పాల్గొన్న కోగంటి సత్యనారాయణ**



**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)**జి.కొండూరులో వెలసిన శ్రీ దాస కార్యసిద్ధి ఆంజనేయస్వామి దేవాలయంలో విగ్రహ పునఃప్రతిష్ట కార్యక్రమం భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ప్రముఖ పారిశ్రామికవేత్త కోగంటి సత్యనారాయణ, వంగవీటి రంగా కుమార్తె వంగవీటి ఆశాకిరణ్ పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నసమారాధనలో భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అన్నసమారాధన కోసం కోగంటి సత్యనారాయణ రూ.30 వేల విలువైన బియ్యాన్ని విరాళంగా అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు కోగంటి సత్యనారాయణ కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మరియు అల్తాఫ్ బబా, గరికపాటి జైపాల్, ముద్దాడ సూరిబాబు, దేశెట్టి బాబురావు, మిర్యాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## భారతీయజనతాపార్టీలో చేరిన విద్యార్థి యువజన నాయకులు



**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)** భారతీయజనతాపార్టీ ఎన్టీఆర్ జిల్లా కార్యాలయమలో సోమవారం మధ్యాన్నం పెద్ద ఎత్తున యువత భారతీయజనతాపార్టీలో చేరారు.ఈ సందర్భంగా పార్టీలో చేరిన యువకులు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కూటమి చేస్తున్న అభివృద్ధి , అందిస్తున్న సంక్షేమ పథకాలు , నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తున్న జాబ్ క్యాలెండర్ లు , కల్పిస్తున్న ఉద్యోగ మరియు ఉపాధి అవకాశాలు పట్ల ఆకర్షితులై భారతీయజనతాపార్టీలో చేరుతున్నామన్నారు.విజయవాడ తూర్పు నియోజకవర్గం కృష్ణలంక , రాణిగారితోట ప్రాంతానికి చెందిన పలువురు యువకులకు పార్టీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, రాష్ట్ర యువమోర్చా అధ్యక్షుడు సునీల్ రెడ్డి, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల గోవిందు ,జిల్లా యువమోర్చా అధ్యక్షుడు గొటిక శివకృష్ణారెడ్డి, సాయి, చాణిక్య, జ్యోతిర్మయి, గాయత్రి, లు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలోకి వచ్చిన వారిలో హర్షిత్ రెడ్డి, వినయ్ సుభాష్, మేగనాథ్ చౌదరి, రిషికేష్ నాయుడు, చరణ్ తదితరులు ఉన్నారు.

## వైభవంగా షిర్డిసాయి బాబా వారి ప్రథమ వార్షికోత్సవం

**సాయిబాబాకు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ప్రత్యేక పూజలు**



**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 13(వార్తా ప్రభ ప్రతినిధి):**కొండపల్లి బి.కాలనీలో ఉన్న శ్రీ షిరిడి సాయిబాబా మందిరం ప్రథమ వార్షికోత్సవ వేడుకలు కన్నుల పండువగా జరుగుతున్నాయి. ఈ వేడుకల్లో పాల్గొన్న మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ బాబా వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు సాదరంగా స్వాగతం పలికి సాయినాథుని చిత్రపటాన్ని, తీర్థప్రసాదాన్ని అందజేశారు. కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు,స్థానిక నాయకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# పూర్తిస్థాయిలో బూత్ స్థాయి ఏజెంట్లను నియమించాలి- జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ.



**మచిలీపట్నం ఏప్రిల్ 13 (వార్తాప్రభ ప్రతినిధి)**జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీలు వారి తరఫున ప్రతి పోలింగ్ కేంద్రానికి బూతు స్థాయి ఏజెంట్లను వచ్చే సమావేశంలోగా అన్ని నియోజకవర్గాలకు పూర్తిస్థాయిలో నియమించాలని జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి డీకే బాలాజీ ఆయా పార్టీల ప్రతినిధులకు సూచించారు.సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నగరంలోని వారి చాంబర్లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించి ఎన్నికలకు సంబంధించిన అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1769 పోలింగ్ కేంద్రాలకు గాను తెలుగుదేశం పార్టీ1710 మందిని బూత్ స్థాయి ఏజెంట్లను నియమించిందని, ఇంకా మచిలీపట్నం గుడివాడ గన్నవరం నియోజకవర్గాల్లో కొంతమందిని నియమించాల్సి ఉందన్నారు. అలాగే వైఎస్ఆర్సిపి 1233 మంది ఏజెంట్లను నియమించిందని, గుడివాడ, పెనమలూరు నియోజకవర్గంలలో ఇంకా ఎవరిని నియమించలేదన్నారు. బిజెపి ఒక్క అవనిగడ్డలో మాత్రమే 21 మంది ఏజెంట్లను నియమించిందన్నారు. జనసేన పార్టీ అవనిగడ్డలో పూర్తిస్థాయిలో బిఎల్ఏ లను నియమించిందన్నారు.భారత జాతీయ కాంగ్రెస్, సిపిఐ ఎం, బి ఎస్ పి పార్టీలు ఇంకా ఎవరిని ఏజెంట్లుగా నియమించలేదన్నారు. వచ్చే సమావేశంలోగా అన్ని రాజకీయ పార్టీలు పూర్తిస్థాయిలో బూత్ స్థాయి ఏజెంట్లను నియమించాలన్నారు. వాటి జాబితాను సంబంధిత నియోజకవర్గాల ఓటర్ల జాబితా నమోదు అధికారికి(ఈ ఆర్ ఓకు) పంపించాలన్నారు.భారత ఎన్నికల సంఘం బూతు స్థాయి ఏజెంట్లకు త్వరలో శిక్షణ ఇవ్వనుందన్నారు.అప్పుడే వారు బూత్ స్థాయి అధికారులతో కలిసి ఇంటింటికి తిరిగి స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీకి తోడ్పడతారన్నారు. బూతు స్థాయి ఏజెంట్లను నియమించకుండానే ఫిర్యాదులు తీసుకోమని స్పష్టం చేశారు. జిల్లాలో ఫారం 6, 7, 8 క్లెయిములకు సంబంధించి మొత్తం 86,313 దరఖాస్తులు అందగా అందులో 84,354 పరిష్కరించడం జరిగిందని, మిగిలిన 1959 దరఖాస్తులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయన్నారు.జిల్లాలో 2002 ఓటర్ల జాబితాను 2025 ఓటర్ల జాబితాతో ప్రత్యేక తీవ్రతర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)మ్యాపింగ్ 69 శాతంబిపూర్తి చేశామన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ చంద్రశేఖర రావు, టిడిపి, ఐ ఎన్సి, బిజెపి, సిపిఎం, బి ఎస్ పి, వైఎస్ఆర్సిపి పార్టీల ప్రతినిధులు దాస్, మతిన్ ఖాన్, పివీ గజేంద్ర రావు, కొడాలి శర్మ.. రాజేష్, బాలాజీ...ఉపేంద్రనాథ్, సిలార్ దాదా...బాషా, కలెక్టరేట్ ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## పిహెచ్సీ లో టీబి నిర్మూలనపై ప్రత్యేక దృష్టి



**సంగం ఏప్రిల్ 13(వార్తాప్రభ ప్రతినిధి)** సంగం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా లెప్రసీ ఎయిడ్స్ టీబి అధికారి డాక్టర్ ఖాదరవల్లి సోమవారం తనిఖీ చేశారు.కేంద్రంలో నిర్వహిస్తున్న సేవలను సమీక్షిస్తూ సిబ్బందికి పలు సూచనలు చేశారు ప్రస్తుతం అమలులో ఉన్న టీబి ముక్త భారత్ అభియాన్ 2.0లో భాగంగా 100 రోజుల కార్యక్రమం గురించి వివరించిన ఆమె గ్రామాల్లో 14 సంవత్సరాల పైబడిన ప్రతి ఒక్కరికి టీబి స్క్రీనింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హ్యాండ్ హెల్డ్ ఎక్స్-రే యంత్రాల ద్వారా పరీక్షలు చేసి టీబి ఉన్నవారిని గుర్తించి వారికి ఉచితంగా మందులు అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా టీబి వ్యాధి వ్యాప్తిని అరికట్టడంతో పాటు పూర్తిగా నిర్మూలించవచ్చని ఆమె పేర్కొన్నారు. సంగం మండలంలో హైరిస్క్ పంచాయతీలుగా సంగం-1 పెరమణ పడమటి పాలెం దువ్వూరు గ్రామాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది ప్రత్యేకంగా పర్యటించి ఎక్స్-రే పరీక్షలు నిర్వహిస్తారని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని సూచించారు.ఈ సందర్భంగా టీబి రోగులకు మందులు సక్రమంగా అందుతున్నాయా అని విచారించి రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ తనిఖీలో వైద్యాధికారి డాక్టర్ అశోక్ సూపర్వైజర్ స్టాఫ్ నర్సులు ఫార్మసిస్ట్ తదితరులు పాల్గొన్నారు.

## హసనాపురంలో విజిబుల్ పోలీసింగ్

### రోడ్డు భద్రతపై అవగాహన... ఏఎస్పేట ఎస్సై సైదులు



**అనుమసముద్రంపేట ఏప్రిల్ 13 (వార్తాప్రభ ప్రతినిధి)** మండలంలోని హసనాపురం సెంటర్లో విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమాన్ని ఏఎస్పేట ఎస్ఐ సైదులు సోమవారం తమ సిబ్బందితో కలిసి నిర్వహించారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని వాహనదారులకు ట్రాఫిక్ నియమాలపై విస్తృత అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వాహనాలపై పరిమితికి మించి ప్రయాణం చేయరాదని ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.అలాగే వాహన ప్రయాణ సమయంలో డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ ఇన్సూరెన్స్ వంటి అవసరమైన పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని తెలిపారు.నియమాలను ఉల్లంఘించిన వాహనదారుల వాహన నంబర్లను నమోదు చేసి మరోసారి అదే తప్పిదంతో కనిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ప్రజల్లో భద్రతా చైతన్యం పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.పోలీసు శాఖ ప్రజల రక్షణ కోసం నిబద్ధతతో పనిచేస్తోందని విధిని సమర్థవంతంగా అమలు చేస్తున్న పోలీసు అధికారుల సేవలు గర్వకారణమని స్థానికులు అభినందించారు.

## నెల్లూరు పాలెంలో విస్తృతంగా కార్డన్ సెర్చ్

**ఆత్మకూరు ఏప్రిల్ 13 (వార్తాప్రభ ప్రతినిధి)** ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని నెల్లూరుపాలెం ముస్లిం కాలనీలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు.నెల్లూరు జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల



ఆదేశాలతో ఆత్మకూరు డీఎస్పీ కే.వేణుగోపాల్ నాచనలతో ఆత్మకూరు సంగం సిఐలు గంగాధర్ శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో ఈ ప్రాంతంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇద్దరు సీఐలు 8 మంది ఎస్ఐలు 40 మంది పోలీసులు పాల్గొన్నారు. ప్రతి ఇంటిని పరిశీలించి ఇక్కడ నివసించి వారి వివరాలు తెలుసుకుంటూ క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా కాలనీవాసులకు సీఐ గంగాధర్ పలు సూచనలు చేశారు. గంజాయి లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సరైన పత్రాలతో వాహనాలు కలిగి ఉండాలని సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడకుండా కొత్త వ్యక్తుల సంచారం పై పర్యవేక్షణ చేయాలంటూ స్థానికులకు సూచించారు.ఈ తనిఖీ లో సరైన పత్రాలు లేని 50 స్కూటర్లు మూడు కార్లు నాలుగు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు.

# మాజీ మంత్రి ఇంట్లో చోరీని ఛేదించిన కృష్ణా జిల్లా పోలీసులు..

### ఓ వ్యక్తిని అరెస్ట్ 15 కేజీల వెండి స్వాధీనం.





**మచిలీపట్నం ఏప్రిల్ 13 (వార్తాప్రభ ప్రతినిధి)**రాష్ట్ర మాజీ మంత్రి కటారి ఈశ్వర్ కుమార్ ఇంట్లో జరిగిన దొంగతనం కేసులో నిందితుడిని పట్టుకుని మీడియా ముందు ప్రవేశ పెట్టిన జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు. 11 కేసుల్లో నిందితుడిగా ఉన్న అంతర్రాష్ట్ర నేరస్తుడు దొడ్లోజి బాబు అలియాస్ రవిబాబుని అరెస్ట్ చేసి అతను వద్దనుండి సుమారు 15 లక్షల విలువైన వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్న కృష్ణా జిల్లా పోలీసులు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ నిందితుల వివరాలు తెలిపారు. నిందితుడు దొడ్లోజి బాబు అలియాస్ రవిబాబు లారీ క్లీనర్ గా పనిచేస్తూ చెడు వ్యసనాలకు బానిసై సులభంగా డబ్బు సంపాదించే ఆలోచనతో దొంగతనాలు పాల్పడుతున్నట్లు తెలిపారు. గుడివాడ టూ టౌన్ పరిధిలోని ఆంజనేయ పేట లో నివాసం ఉంటున్న రాష్ట్ర మాజీ మంత్రి కటారి ఈశ్వర్ కుమార్ కు చెందిన ఇంట్లో మార్చి 14 న దొంగతనంపై వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎటువంటి ఆధారాలు లేకపోయినప్పటికీ గుడివాడ టూ టౌన్ పోలీసులు చాకచక్యంగా నిందితుడిని అదుపులో తీసుకున్నట్లు వెల్లడించారు. ఘటన స్థలంలో ఆధారాల కోసం సాంకేతికతను ఉపయోగించి మానవ మేదస్సుతో గుడివాడ టూ టౌన్ పోలీసులు కేసును చేదించడం అభినందనీయం అని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు అన్నారు.

# ఇంటింటి పండగల కొండపల్లి ఉత్సవం




**పెద్ద పండగలా కొండపల్లి బొమ్మల మేళా**
**ఈ నెల 18 నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు**
**ఏటా నిర్వహణకు ప్రత్యేక ప్రణాళికతో ముందడుగు**
**మన ఘన సంస్కృతీసంప్రదాయాలను పరిరక్షించే గొప్పప్రయత్నం**

**- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 13 (వార్తా ప్రభ ప్రతినిధి):** ఎన్టీఆర్ జిల్లా సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే కొండపల్లి బొమ్మల మేళా ఈ నెల 18 నుంచి మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. ఈ మేళాను ప్రతి సంవత్సరం నిర్వహించేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని ఆయన వెల్లడించారు.కలెక్టర్ లక్ష్మీశ సోమవారం కొండపల్లి బొమ్మల ఎక్స్పీరియన్స్ సెంటర్లో కొండపల్లి బొమ్మల మేళాపై మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండపల్లి బొమ్మలు రాష్ట్రానికి మాత్రమే కాకుండా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన సంప్రదాయ కళలలో ఒకటని.. ప్రపంచ వారసత్వ దినోత్సవం అయిన ఈ నెల 18వ తేదీ నుంచి మూడు రోజుల పాటు కొండపల్లి బొమ్మల మేళాను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మన కొండపల్లి బొమ్మను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు, మన భావితరాలకు హస్తకళా వైభవాన్ని విలువైన బహుమతిగా అందించేందుకు ఈ ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. మేళా సందర్భంగా వివిధ రకాల కొండపల్లి బొమ్మల ప్రదర్శనలు, అమ్మకాలు, కళాకారులతో ప్రత్యక్ష పరస్పర చర్యలు, మేధోమేధన చర్చలు వంటివి ఉంటాయన్నారు. బ్రాండింగ్, కొత్త డిజైన్లు, ఆన్లైన్ మార్కెటింగ్ వంటి వాటిపైనా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేళా మన సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచి, సంస్కృతి పరిరక్షణలో ఒక మైలురాయిగా నిలుస్తుందని.. ఈ మూడు రోజులు కొండపల్లి ప్రజలు సరికొత్త ఉత్సాహంతో పండగ వాతావరణంతో కార్యక్రమాల్లో భాగస్వాములై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వారసత్వ సంస్కృతి, ఆధునిక జెన్ జెడ్, పండగలు, సుస్థిర అభివృద్ధి తదితర అంశాలపై మార్చి 8న కొండపల్లి బొమ్మల పోటీ నిర్వహించడం జరిగిందని.. ఇందులోని విజేతలకు కొండపల్లి బొమ్మల మేళా కార్యక్రమం సందర్భంగా రూ. లక్ష విలువైన బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. జిల్లా అధికార యంత్రాంగం.. కొండపల్లి ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ సొసైటీ భాగస్వామ్యంతో ఈ మేళాను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ వివరించారు.

సమావేశంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎ.శిల్ప, కొండపల్లి మున్సిపల్ ఛైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, ఆర్టీఐహెచ్ విజయవాడ సీఈవో జి.కృష్ణన్, జిల్లా అటవీ శాఖ అధికారి సతీష్, వివిధ శాఖల అధికారులు, కొండపల్లి ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ సొసైటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రైతన్నలకు రైతుబిడ్డగా... అన్నదానం చేయడం నా అదృష్టం.

### 19వ విడత అన్నదాత సుదర్శన్ కు కృతజ్ఞతలు

### టి ఆర్ పి ఎస్ అధ్యక్షురాలు ఇంద్రపాల భవాని



**జవహర్ నగర్ ఏప్రిల్ 13: (వార్తా ప్రభ)**రైతు బిడ్డగా రైతన్నలకు అన్నదానం చేయడం నా అదృష్టమని, అన్ని దానాలలో కెల్లా అన్నదానం గొప్పదని ఆ అదృష్టం భగవంతుడు నాకు కల్పించడం ఎంతో గర్వంగా భావిస్తున్నానని తెలంగాణ రైతు పరిరక్షణ సమితి అధ్యక్షురాలు ఇంద్రపాల భవాని అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో మేడ్చల్ మల్కాజ్గిరి కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం నాడు 19వ విడత రైతు-అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్ని దానాలు చేసిన అన్నదానంకు సరి రాదని అటువంటి అన్నదానాన్ని తమ సంస్థ ద్వారా చేయడం సంతోషంగా ఉందన్నారు. ఇప్పటివరకు 18 విడతలుగా అన్నదాన కార్యక్రమం నిర్వహించామని, సోమవారం నాడు నిర్వహించిన 19వ విడత అన్నదాన కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి విలాసాగరం సుదర్శన్ సహకరించారని వారికి సంస్థ తరఫున ఆమె ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుతం సుమారు100 మంది వరకు అన్నదానం అందిస్తున్నామని, భవిష్యత్తులో 150 మంది వరకు అన్నదానం అందించేందుకు ప్రయత్నం చేస్తామని తెలిపారు . మానవతా దృక్పథంతో నిర్వహించే ఈ అన్నదాన కార్యక్రమానికి దాతలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు ఇంద్రపాల సత్యనారాయణ దావత్ అరుణ్ కుమార్ అంబాల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# పుత్రకామేష్టి యాగానికి అపూర్వ స్పందన...



**గుడ్లవల్లేరు: ఏప్రిల్ 13: (వార్తా ప్రభ** మండలంలోని డోకిపర్రు మహాక్షేత్రంలోని శ్రీ భూసమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పుత్రకామేష్టి యాగం మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వేంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ యాగానికి దండోపతండాలుగా వేలాది మంది భక్తులు విచ్చేసేసరికి అపూర్వ స్పందన లభించింది. నిర్వాహకులు కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు భక్తుల సౌకర్యార్థం ప్రసాదం, మంచినీరు, అన్న ప్రసాదాల ఏర్పాట్లను చేపట్టారు. ఉదయం తొమ్మిది గంటలకు యాగం ప్రారంభమైంది. సంతానం లేని దంపతులు ఈ యాగంలో అధికసంఖ్యలో వేలాదిగా పాల్గొని శ్రీ వేంకటేశ్వరుని కపకు పాత్రులయ్యారు. స్వామివారి సన్నిధిలో ప్రతి ఏదాది ఈ యాగం నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది. డోకిపర్రు మహాక్షేత్రంలో జరిగిన ఈ పుత్రకామేష్టి యాగంలో పాల్గొన్న వారికి తప్పకుండా సంతాన ప్రాప్తి కలుగుతుందని ఆలయ ప్రధాన పూజారి పరాంకుశం శ్రీధర్ స్వామి తెలిపారు.

## జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మర్యాదపూర్వకంగా టీడీపి నాయకులు కిరణ్ కుమార్ రెడ్డి

**రెడ్డిగూడెం, ఏప్రిల్13(వార్తాప్రభ ప్రతినిధి ):**రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రివర్యులు నిమ్మల రామానాయుడుని ఎన్టీఆర్ జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు పైడమర్ల కిరణ్ కుమార్ రెడ్డి ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా సాగునీటి సమస్యలు,కాలువల పునరుద్ధరణ,చెరువుల అభివృద్ధి వంటి కీలక అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.ప్రజల సంక్షేమం పట్ల ఆయన చూపుతున్న కట్టుబాటు ఓర్పుతోవిన్న తీరు ఎంతో ప్రేరణాత్మకంగా ఉంది అని ఆయన నాయకత్వంలో రాష్ట్ర జలవనరుల అభివృద్ధి మరింత వేగంగా కొనసాగుతుందని విశ్వాసం వ్యక్తం చేసారు .ఈ కార్యక్రమం లో రెడ్డిగూడెం ఎన్టీఆర్ యూత్ ప్రెసిడెంట్ పిడపర్తి మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# బీసీల డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలి

**- ముస్లిం మైనారిటీ నాయకుడు వాజీద్ ఖాన్ డిమాండ్**



**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)** రాష్ట్రంలో బీసీ వర్గాల సమస్యలను ప్రభుత్వం అత్యవసరంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందని మైనార్టీ నాయకులు వాజిద్ ఖాన్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ఏ రాజకీయ పార్టీ అధికారంలోకి వచ్చినా బీసీలకు ఇచ్చే హామీలు కేవలం మాటలకే పరిమితం అవుతున్నాయని, కానీ ఆచరణలో మాత్రం సరైన న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు చట్టబద్ధమైన హక్కులు, సామాజిక న్యాయం అందించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని విమర్శించారు. మంగళగిరి లో బీసీ అజెండా అమలుకు డిమాండ్ చేస్తూ ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న బిసి వై పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ ని మైనార్టీ నాయకులు వాజీద్ ఖాన్ మరియు ముస్లిం సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముక్తార్ అలీ కలిసి ఆయనకు సోమవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బీసీల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి, స్పష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. “మా ఓటు ఒకటే, మా ఆత్మగౌరవం ఒకటే. మంగళగిరి వేదికగా జరుగుతున్న ఈ దీక్షకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు మద్దతు తెలపాలి” అని పిలుపునిచ్చారు.

## ప్రజా సిటీ కాలనీ అసోసియేషన్ నూతన కార్యవర్గం కు నిమ్మల రామకృష్ణ గౌడ్ శుభాకాంక్షలు



**శేరిలింగంపల్లి,ఏప్రిల్ 13 (వార్తాప్రభ):**హఫీజ్పేట్ డివిజన్ పరిధిలోని ప్రజాసిటీ కాలనీ అసోసియేషన్ ఎన్నికల్లో ప్రెసిడెంట్గా గెలుపొందిన నాగేశ్వరరావు,అలాగే ప్యానెల్ సభ్యులకు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నిమ్మల రామకృష్ణ గౌడ్ అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి ఎన్నికైన ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన,శుభ్రత,భద్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు.అనంతరం కాలనీ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై నూతన కమిటీ సభ్యులతో చర్చించారు.ప్రజల సమస్యలను పరిష్కరించడంలో తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని నిమ్మల రామకృష్ణ గౌడ్ హామీ ఇచ్చారు

## లుంబిని విద్యాలయం నందు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

**చేజర్ల ఏప్రిల్ 13 (వార్తాప్రభ)** లుంబిని విద్యాలయం నందు సోమవారం యుకేజీ నుండి 1వ తరగతి మరియు 5వ నుండి 6వ తరగతికి ప్రమోట్ చేయబడిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించామని మరియు 2025-26 విద్యా సంవత్సరంలో



వివిధ రకాల పోటీపరీక్షల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థిని విద్యార్థులకు పాఠశాల కరెస్పాండెంట్ బి.రాము చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. బహుమతుల ప్రధానం అనంతరం విద్యార్థిని విద్యార్థులు క్రమశిక్షణతో ఉండి మంచి విద్యాబుద్ధులు అలవర్చుకావాలని ఈ. సందర్భంగా ఆయన తెలియజేశారు.అంతేకాకుండా ఎల్ కేజీ నుండి 9 వ తరగతి వరకు 2025-26 సంవత్సరంలో జరిగిన పరీక్షా ఫలితాలు ఆధారంగా బహుమతులు ప్రాధానోత్సవం కార్యక్రమం నిర్వహించుట జరిగింది.తదుపరి విద్యార్థిని విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుట జరిగింది.

## ఇంటర్ ఫలితాల్లో శ్రీవశిష్ట దూకుడు

**-రాష్ట్రవ్యాప్తంగా అగ్రస్థానాల వర్షం**

**ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో టాప్ స్కోర్లతో వందలాది విద్యార్థుల సత్తా**






**కూకట్ పల్లి, ఏప్రిల్ 12(వార్తాప్రభ):**తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన ఇంటర్ మొదటి మరియు ద్వితీయ సంవత్సర పరీక్ష ఫలితాల్లో శ్రీవశిష్ట విద్యాసంస్థల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు.రాష్ట్ర స్థాయిలో అగ్రస్థానాలు సాధిస్తూ మరోసారి తమ సత్తా చాటుకున్నారు. జూనియర్ ఎంపీసీ విభాగంలో 468, 467, 466, 465, 464, 463, 462, 461, 460 మార్కులకు పైగా వందలాది మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అలాగే జూనియర్ బైపీసీ విభాగంలో 438, 437, 436, 435, 434, 433, 432, 431, 430 మార్కులకు పైగా అనేక మంది విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు.ద్వితీయ సంవత్సరం ఎంపీసీ మరియు బైపీసీ విభాగాల్లో కూడా 995, 994, 993, 992, 991, 990 మార్కులకు పైగా చాలా మంది విద్యార్థులు సాధించడం విశేషం.ఈ సందర్భంగా శ్రీవశిష్ట విద్యాసంస్థల చైర్మన్ లింగమనేని ప్రమీలారాణి మాట్లాడుతూ సాధారణ విద్యార్థులతో అసాధారణ ఫలితాలు సాధించడం తమ సంస్థకు కొత్తేమీ కాదని తెలిపారు. ప్రత్యేక ప్రణాళికలు, అధ్యాపకుల మరియు అధ్యాపకేతర సిబ్బంది కృషి, విద్యార్థుల క్రమశిక్షణ, తల్లిదండ్రుల సహకారం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని చెప్పారు.శ్రీవశిష్ట విద్యాసంస్థలపై విశ్వాసం ఉంచి తమ పిల్లలను చేర్పించిన తల్లిదండ్రులకు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## కాలనీల సమస్యలను పరిష్కరించండి

**-వేం నరేందర్ రెడ్డికి వినతి**



**కూకట్ పల్లి,ఏప్రిల్ 12(వార్తాప్రభ):**కూకట్ పల్లి నియోజకవర్గం వసంత్ నగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల సమస్యలను పరిష్కరించాలని రాజ్యసభ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వేం నరేందర్ రెడ్డి ని పలువురు కాలనీ నాయకులు కలిసి విన్నవించారు. ఆదివారం కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్ ఛార్జ్ బండి రమేష్ ఆధ్వర్యంలో వసంత్ నగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల అధ్యక్షులు, కమిటీ సభ్యులు వేం నరేందర్ రెడ్డి ని ఆయన నివాసంలో కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్చాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాలనీలలోని పలు సమస్యలను నాయకులు ఆయన ముందు ఏకరువు పెట్టారు. కాలనీలోని పలు సర్వే నెంబర్లలో నిర్మాణానికి సంబంధించిన అనుమతులు నిలిచిపోవడంతో పాటు కాలనీ లలో పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆయన కాలనీల కమిటీ సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వసంత్ నగర్ కాలనీ అధ్యక్షులు నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ ప్రసాద్, భగత్ సింగ్ నగర్ కాలనీ అధ్యక్షులు శ్రీనివాసరావు,సి బి సి ఐ డి కాలనీ అధ్యక్షులు ప్రభాకర్, ఎన్ఆర్ఎస్ఏ కాలనీ అధ్యక్షులు హనుమంతరావు, నాయకులు కిలారు శ్రీనివాస బాబు,అనిల్ వర్మ,సాంబశివ రావు, హరి బాబు, నాని, సాయిరాం, వెంకట్ రావు, ప్రసాద్, రాజు,కొఠారి వెంకట్,వాసు,నరసింహ రావు,గూడూరు సాంబశివరావు పలు కాలనీల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జీడిమెట్ల సర్కిల్‌లో ముమ్మరంగా నాలాల పూడికతీత పనులు







**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 13, (వార్తాప్రభ)** : ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలిలి వేగంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా 39వ రోజు జీడిమెట్ల సర్కిల్-55 పరిధిలోని పలు ప్రాంతాల్లో నాలాల పూడికతీత పనులను మున్సిపల్ సిబ్బంది చేపట్టారు. కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలోని వార్డు 129లో వర్షాకాలం దృష్ట్యా నీటి ప్రవాహానికి ఆటంకం కలగకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. కుత్బుల్లాపూర్ ఫస్ట్ అవెన్యూ సమీపంలోని కెమికల్ నాలాలో పేరుకుపోయిన వ్యర్థాలను, పూడికను యంత్రాల సహాయంతో తొలగించారు. ఎన్.సి.ఎల్ కాలనీలోని ఓపెన్ నాలాలో ప్రవాహానికి అడ్డుగా ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించి, పూడికతీత పనులు పూర్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చేపట్టిన ఈ 99 రోజుల ప్రణాళికలో భాగంగా, ప్రతిరోజూ సర్కిల్ వ్యాప్తంగా పారిశుధ్యం, డ్రైనేజీ నిర్వహణ మరియు మౌలిక సదుపాయాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# రహదారులపై ఆక్రమణలు చేస్తే కఠిన చర్యలు







### గజలరామారం ఉప కమిషనర్ హెచ్చరిక

**గాజులరామారం, ఏప్రిల్ 13, (వార్తాప్రభ)** : గాజులరామారం సర్కిల్ పరిధిలో రహదారుల వెంట ఉన్న అక్రమ ఆక్రమణలను మున్సిపల్ అధికారులు పోలీసుల సహకారంతో సోమవారం తొలగించారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించారు. రోడ్లపై అడ్డంగా ఉన్న కట్టడాలు, వ్యాపార సంస్థల ఆక్రమణల వల్ల వాహనదారులకు, పాదచారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని గుర్తించిన అధికారులు ఈ చర్యలు చేపట్టారు. పోలీసు సిబ్బంది రక్షణ నడుమ జరిపిన ఈ తొలగింపు కార్యక్రమంతో రహదారులు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా క్లియర్ అయ్యాయి. ఈ సందర్భంగా ఉప కమిషనర్ శ్రీపాద రామేశ్వర్ మాట్లాడుతూ.. సర్కిల్ పరిధిలో ప్రభుత్వ స్థలాలను లేదా రహదారులను ఆక్రమిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించి అక్రమ ఆక్రమణలకు పాల్పడే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉప కమిషనర్‌తో పాటు ఏసిపి సుమిత్ర టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ మచెందర్ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది. ట్రాఫిక్ మరియు లా అండ్ ఆర్డర్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# వేసవిలో పిల్లల భద్రతపై అప్రమత్తత అవసరం

### తల్లిదండ్రులకు పిల్లలపై నిఘా ఉంచాలి- ఆత్మకూరు ఎస్సై జిలాని



**ఆత్మకూరు ఏప్రిల్ 12 (వార్తాప్రభ ప్రతినిధి)**ఆత్మకూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నీగ్రామాలలో వేసవి సెలవులు ప్రారంభమైన నేపథ్యంలో చిన్నారుల భద్రతపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆత్మకూరు స్థానిక ఎస్సై జిలాని సూచించారు.ఇటీవల విద్యార్థుల పరీక్షలు ముగిసి జులై 12 వరకు సెలవులు ఉండటంతో పిల్లలు ఎక్కువ సమయం ఇంటిపట్టునే గడుపుతున్నారని ఈ సమయంలో వారి కదలికలపై తల్లిదండ్రులు దృష్టి సారించి అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు.ప్రత్యేకంగా వేసవి తీవ్రత కారణంగా చిన్నారులు చెరువులు కుంటలు నది ప్రాంతాలకు వెళ్లి ఈత కొట్టేందుకు ఆసక్తి చూపుతుంటారని అయితే ఈత రాని పిల్లలు అజాగ్రత్తగా నీటిలోకి దిగితే ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని హెచ్చరించారు. ఇటువంటి సంఘటనలు అనేక చోట్ల నమోదవుతున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి అని పేర్కొన్నారు.పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారు ఎవరితో తిరుగుతున్నారు అనే విషయాలను తల్లిదండ్రులు నిఘానేత్రంతో గమనించాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న చెరువులు గుంటలు వద్ద పిల్లలు ఆడకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ అవసరమని సూచించారు. అలాగే పిల్లలకు నీటి ప్రమాదాల గురించి అవగాహన కల్పించడం ద్వారా ఇలాంటి ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు.వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటంతో పిల్లలు ఆరోగ్యపరమైన సమస్యలకు కూడా గురయ్యే అవకాశం ఉందని, తగినంత నీరు తాగించడం, మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకుండా చూసుకోవడం వంటి జాగ్రత్తలు కూడా తీసుకోవాలని ఎస్సై జిలాని సూచించారు.చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉన్నందున తల్లిదండ్రులు స్థానిక ప్రజలు కలిసి పిల్లల భద్రతపై మరింత బాధ్యతతో వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు.

## నేటి రాజ్యాంగ ఫలాలు నాటి బాబాసాహెబ్ కృషి ఫలితమే



**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 13(వార్తా ప్రభ ప్రతినిధి):**మండల పరిధిలోని కాచవరం మండల పరిషత్ పాఠశాలలో భారతరత్న, ప్రపంచ మేధావి, బృహత్ ప్రజ్ఞాశాలి, రాజ్యాంగ శిల్పి డాక్టర్ బాబాసాహెబ్ భీమ్రావు అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రేస్ మినిస్ట్రీస్ డైరెక్టర్ డాక్టర్ రెవరెండ్ ఎలీషా హాజరై మాట్లాడుతూ అంబేద్కర్ చిన్నతనంలో ఎదుర్కొన్న కష్టాలు, అంటరానితనం, కుల వివక్షలను అధిగమించి దేశ విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించి, భారత రాజ్యాంగాన్ని రూపొందించడానికి చేసిన మహోన్నత కృషిని విద్యార్థులకు వివరించారు. ఉర్దూ ఉపాధ్యాయుడు మహమ్మద్ ఇర్ఫాన్ పాషా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాణానికి అంబేద్కర్ చేసిన కృషిని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు, సీఆర్పీ నాగేశ్వరావు పాల్గొన్నారు.

## సమాజ అభివృద్ధి కోసం అంబేద్కర్ ఆశయాలు కొనసాగించాలని ఎమ్మెల్యే కామినేని పిలుపు.

### మండవల్లిలో ఘనంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ

**మండవల్లి ఏప్రిల్ 13 (వార్తా ప్రభ)** మండవల్లి మండలం, లోకుముడి:లోకుముడి సిఎన్ఆర్ గార్డెన్స్ ఎదురుగా ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని సోమవారం ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఘనంగా ఆవిష్కరించారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అంబేద్కర్ భారతదేశానికి అందించిన రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యుత్తమమైనదిగా నిలిచిందన్నారు. సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ అనే విలువలను ప్రజలకు అందించిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. ఆయన ఆలోచనలు నేటి యువతకు మార్గదర్శకంగా నిలుస్తాయని తెలిపారు.అంబేద్కర్ జీవితమంతా సామాజిక న్యాయం కోసం అంకితమైందని, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. విద్య ద్వారా శక్తివంతమైన సమాజాన్ని నిర్మించాలని ఆయన ఇచ్చిన సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ జయ మంగళ వెంకటరమణతో పాటు నాయకులు వీరమల్లు నరసింహారావు, రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టర్ పి.జె.ఎస్ మాల్యాద్రి, కొడాలి వినోద్, చాపరాల దుర్గాప్రసాద్, బికేఎం నాని, పోలా రాజి, పెనుమర్శ త్రినాధ రాజు, నారగాని నాగేశ్వరరావు, బుసరం బోయిన శ్రీనివాస్, గంగుల ఆదినారాయణ, మత్తె రవి ప్రసాద్, గడిదేసి విజయ్ కుమార్, చీలి వెంకటరత్నం, ముత్యాల ఏరియా, సదర్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపు



## అనుమతిలేని చెరువుల తవ్వకంపై రెవెన్యూ కఠిన చర్యలు

### పేదల భూములను కాపాడిన అధికారులు

### ముదినేపల్లి మండలం, వైవాక గ్రామం:



**ముదినేపల్లి ఏప్రిల్ 13 (వార్తా ప్రభ)** పేదల కోసం ప్రభుత్వం కేటాయించిన డీ-ఫామ్ పట్టా భూములను అక్రమంగా చెరువులుగా మార్చే ప్రయత్నాన్ని రెవెన్యూ సిబ్బంది సమయోచితంగా అడ్డుకుని ప్రశంసలు అందుకున్నారు. వైవాక గ్రామంలో 311 మంది పేదలకు 28 సెంట్లు చొప్పున కేటాయించిన సుమారు 89 ఎకరాల భూములను ఒక ప్రభావశీల వ్యక్తి అనుమతులు లేకుండా భారీ చెరువుగా మార్చేందుకు తవ్వకాలు ప్రారంభించిన విషయం వెలుగులోకి వచ్చింది.ఈ సమాచారం అందుకున్న వెంటనే ముదినేపల్లి ఎమ్మార్వో ఎస్.కె. లక్కీమ్ పాష, రెవెన్యూ ఇన్స్పెక్టర్ పి.ఎస్. రాజశేఖర్, విఆర్ఓ గూడపాటి నాగరాజు తదితర రెవెన్యూ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని తవ్వకాలను తక్షణమే నిలిపివేశారు. ప్రోక్లైన్ యంత్రాలను అక్కడి నుంచి తరలించి, అక్రమ కార్యకలాపాలకు గట్టి చెక్ పెట్టారు.పేదల హక్కులను రక్షించడంలో తమ నిబద్ధతను మరోసారి చాటిన రెవెన్యూ అధికారులు, అసైన్మెంట్ మరియు డీ-ఫామ్ పట్టా భూములను ఎటువంటి అనుమతులు లేకుండా చెరువులుగా మార్చే ప్రయత్నాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.గ్రామస్తులు కూడా రెవెన్యూ సిబ్బంది చురుకైన చర్యలను ప్రశంసిస్తూ, పేదల భూములను కాపాడిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో రెవెన్యూ సిబ్బంది అప్రమత్తత -- అక్రమాలకు కట్టడి!

## వైభవోపేతంగా శ్రీ వేంకటేశ్వరుని ఊంజల సేవ...



**గుడ్లవల్లేరు:ఏప్రిల్ 13 (వార్తా ప్రభ)** భూ సమేత శ్రీ వేంకటేశ్వరాలయంలో స్వామివార్ల ఉత్సవ మూర్తులకు మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వేంకట కష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ఆలయ పండితులు వేద మంత్రోచ్చరణ నడుమ ఊంజల సేవను వైభవోపేతంగా చేపట్టారు. అనంతరం ప్రత్యేక పూజల్ని నిర్వహించారు. కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు. ఆలయ నిర్వాహకులు కె.బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు తదితరులు ఉన్నారు.



## ఏనుగు సుదర్శన్‌రెడ్డి పరామర్శతో జవహర్ నగర్ అగ్ని ప్రమాదబాధితురాలు రాధకుటుంబానికి ఆశాభావం

### ఇల్లు దగ్ధమై రోడ్డున పడిన నిరుపేద కుటుంబం



**జవహర్ నగర్, ఏప్రిల్ 13:(వార్తా ప్రభ)**జవహర్ నగర్ పరిధిలోని బి.జే.ఆర్ నగర్‌లో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన దురదృష్టకర సంఘటనలో రాధ (38) అనే నిరుపేద మహిళ ఇల్లు షార్ట్ సర్క్యూట్ కారణంగా భారీ అగ్ని ప్రమాదానికి గురైంది.ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న డబ్బులు, నిత్యావసర సరుకులు, గృహోపకరణాలు మొత్తం పూర్తిగా కాలిపోయి బూడిదయ్యాయి. దీంతో రాధ కుటుంబం పూర్తిగా నిరాశ్రయులై రోడ్డున పడింది.రాధకు 12 సంవత్సరాల క్రితమే భర్త మరణించడంతో, ఆమె ఇంటి పనులు చేస్తూ పిల్లలను పోషిస్తూ జీవనం సాగిస్తోంది. అయితే ఈ ప్రమాదంతో వారి జీవితం మరింత కష్టాల్లో పడింది.సమాచారం అందుకున్న వెంటనే స్థానిక నాయకులతో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించిన మాజీ ఎంపీపీ,మేడ్చల్ నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ ఏనుగు సుదర్శన్ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి వారికి మనోధైర్యం అందించారు. అలాగే అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.ప్రస్తుతం బాధిత కుటుంబం తాత్కాలిక ఆశ్రయం కోసం ఎదురుచూస్తోంది. స్థానికులు, దాతలు ముందుకు వచ్చి సహాయం చేయాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పానుగంటి బాబు, మేడ్చల్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు మహేందర్ యాదవ్, సీనియర్ నాయకులు సంతోష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా "మర్రి గోల్డ్ అండ్ డైమండ్స్" మెగా షోరూం ప్రారంభం.

### 365 రోజులూ అతితక్కువ తరుగు ఆఫర్ లో

### వినియోగదారులకు సరికొత్త స్వర్ణ సౌలభ్యం




**కూకట్ పల్లి,ఏప్రిల్ 12(వార్తాప్రభ):**భాగ్యనగర పసిడి ప్రియుల చిరకాల వాంఛ నెరవేరుస్తూ కూకట్పల్లి మెట్రో స్టేషన్ సమీపంలో మర్రి గోల్డ్ అండ్ డైమండ్స్' మెగా షోరూం ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. జంట నగరాల్లోనే అతి పెద్దదిగా, నాలుగు అంతస్తుల విశాలమైన భవనంలో అంతర్జాతీయ హంగులతో తీర్చిదిద్దిన ఈ షోరూంను ప్రముఖ సినీ నటుడు, విక్టరీ వెంకటేష్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు.

**విక్టరీ వెంకటేష్ ప్రశంసలు** షోరూంలోని అద్భుతమైన కలెక్షన్లను తిలకించిన వెంకటేష్ మాట్లాడుతూ, "హైదరాబాద్ ప్రజలకు వేలాది సరికొత్త డిజైన్లను ఒకే చోట అందించడం అభినందనీయం. ముఖ్యంగా సామాన్యులకు భారం కాకుండా సంవత్సరం పొడవునా అతితక్కువ తరుగు ధరలకే బంగారం అందించాలనే యాజమాన్యం ఆలోచన చాలా గొప్పది,అని కొనియాడారు.

## విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి ఎదగాలి

**-ఎమ్మెల్యే గాంధీ అభిలాష**



**చందానగర్,ఏప్రిల్ 13 (వార్తాప్రభ)**: చందానగర్‌లోని సరస్వతి విద్యా మందిర్ పాఠశాలలో నూతనంగా నిర్మించిన మల్టీపర్పస్ హాల్‌ను పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మంజుల రఘునాథ్ రెడ్డి, నార్నె శ్రీనివాసరావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ఆధునిక విద్యలో స్మార్ట్ తరగతి గదుల ప్రాముఖ్యతను వివరించారు. పాఠశాల అభివృద్ధికి సహకరించిన దాతలను అభినందిస్తూ, విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## పాదచారుల సమస్యలు పరిష్కరించండి



**శేరిలింగంపల్లి,ఏప్రిల్ 13 (వార్తాప్రభ)**:మియాపూర్ డివిజన్ పరిధిలో హెచ్ఎంటి నుంచి జేపీ నగర్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై ప్రతి గురువారం నిర్వహించే వారాంత మార్కెట్ కారణంగా తీవ్ర ట్రాఫిక్ సమస్యలు నెలకొంటున్నాయి.గంటల తరబడి వాహనాలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.విశ్వనాథ్ గార్డెన్ సమీపంలో ఫంక్షన్లు ఉన్న సమయంలో ట్రాఫిక్ పూర్తిగా అదుపు తప్పుతూ అత్యవసర సేవలకు ఆటంకం కలుగుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అదేవిధంగా ఫుట్‌పాత్‌లపై అక్రమ ఆక్రమణల కారణంగా పాదచారులు రోడ్డుపై నడవాల్సిన పరిస్థితి ఏర్పడి ప్రమాదాలు సంభవించే అవకాశాలు పెరుగుతున్నాయి.ఈ సమస్యలపై మియాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు వినతి పత్రం అందజేసినట్లు మియాపూర్ డివిజన్ అధ్యక్షుడు ఆకుల లక్ష్మణ్ ముదిరాజ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు గుండె గణేష్ ముదిరాజ్,జాజేరావు,శ్రీనివాస్, దర్గా శేఖర్ పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన మాజీ సర్పంచ్ ప్రత్తిపాటి ధర్మరాజు



**మైలవరం,ఏప్రిల్ 13 (వార్తాప్రభ) :** మండలంలోని వెల్వడం గ్రామం ఎస్సీ ఏరియాకు చెందిన ప్రత్తిపాటి చిట్టెమ్మ అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. చిట్టెమ్మ మృతి చెందారన్న విషయం తెలుసుకున్న ఆ గ్రామ మాజీ సర్పంచ్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రత్తిపాటి ధర్మరాజు ఆమెకు నివాళులర్పించారు. అనంతరం మృతురాలు చిట్టెమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.బాధిత కుటుంబానికి ఆర్థిక సాయంగా ధర్మరాజు తన సొంత నిధులు రూ.5000 లు మరియు బియ్యం టిక్కీ అందచేశారు.ధర్మరాజు తోపాటు వైస్ ఎంపీపీ రత్నబాబు,సందిపాము నాగేశ్వరరావు,పొదిలి చంటి, మొండితోక భాస్కర్,సందిపాము శేషగిరి, ప్రత్తిపాటి ప్రసాద్, ప్రత్తిపాటి అర్జున్,ప్రత్తిపాటి గణేష్, ప్రత్తిపాటి కోటేశ్వరరావు, మొండితోక మోషే,ప్రత్తిపాటి లక్ష్మయ్య(బద్దయ్య) చిట్టెమ్మ కు నివాళులు అర్పించారు.

# రైతన్నలను రాజులను చేయడమే లక్ష్యంగా సాగుతున్న కూటమి ప్రభుత్వం

- రూ.7.72 కోట్లతో కొమరవోలు మేజర్ డ్రైన్ అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యేలు వర్ల, వెనిగండ్ల



**గుడివాడ,ఏప్రిల్ 13 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో రైతన్నలను రాజులను చేయడమే సీఎం చంద్రబాబు నాయకత్వం లోని కూటమి ప్రభుత్వ లక్ష్యమని పామర్రు, గుడివాడ ఎమ్మెల్యేలు వర్ల కుమార్ రాజా, వెనిగండ్ల రాము అన్నారు. గత ప్రభుత్వం వ్యవసాయాన్ని దండగగా మారిస్తే.. కూటమి ప్రభుత్వం పండగల మారుస్తుందని ఎమ్మెల్యేలు హర్షం వ్యక్తం చేశారు. పామర్రు, గుడివాడ నియోజకవర్గాలు, ముదినేపల్లి మండలం మీదుగా ప్రవహించే కొమరోలు మేజర్ డ్రైన్‌కు రూ.7.72 కోట్ల నిధులతో చెయ్యనున్న అభివృద్ధి పనులను పామర్రు, గుడివాడ ఎమ్మెల్యేలు వర్ల కుమార్ రాజా, వెనిగండ్ల రాము ప్రారంభించారు. పామర్రు మండలం కురుమద్దాలి నుండి ముదినేపల్లి మండలం కోడూరు వరకు 19 కిలోమీటర్ల మేర చేపట్టనున్న పూడికతీత పనులను, గుడివాడ రూరల్ మండలం రామన్నపూడి గ్రామం వద్ద ఎమ్మెల్యేలు కుమార్ రాజా, రాము పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు ఇరువురు స్వయంగా ప్రొక్లైన్ ఆపరేట్ చేస్తూ డ్రైన్ లో కూడిక తొలగింపు పనులను ప్రారంభించారు. దశాబ్దం తర్వాత పనులు చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే కుమార్ రాజా, వెనిగండ్ల రాములకు రైతులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వరరావు గుడివాడ జనసేన ఇన్చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మండల టిడిపి అధ్యక్షుడు వాసే మురళి, డి.సి చైర్మన్ కొసరాజు వెంకటేశ్వరరావు, డ్రైనేజీ శాఖ ఈ.ఈ కిరణ్ కుమార్, డి.ఈ రామకృష్ణ, ఏ.ఈ కుమార్, నీటి సంఘాల అధ్యక్షులు శేషు బాబు, వల్లభనేని వెంకటరత్నం, వీర బసవయ్య, కుటుంబరావు, ధనకోటి, చలసాని శ్రీధర్, పామర్రు టిడిపి నాయకులు చాట్ల రమేష్, పామర్రు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కెదరాశి పల్లి శీను, మండల టిడిపి నాయకులు గుత్తా చంటి, సూరపనేని రామకృష్ణ, మసిముక్కు గోపాలకృష్ణ, బట్రాజు నాగరాజు, మీగడ సుబ్బారావు, గోరిపర్తి నాని బాలాజీ, కైలా కాళిదాసు, గంజి శివయ్య, సురగాని సూరిబాబు, కొండవీటి ఫణీంద్ర, పలువురు రైతులు, రైతు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలను చూసి చలించి పోయిన వేదవ్యాస్



**పెడన,ఏప్రిల్ 13 (వార్తాప్రభ) :** ఇటీవల పెడనకు చెందిన టిడిపి నాయకురాలు ఖుర్షీద్ బేగం దంపతులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నేపథ్యంలో సోమవారం సాయంత్రం వారి పిల్లలను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బూరగడ్డ వేదవ్యాస్ పరర్శించారు. ఖుర్షీద్ బేగం ఇంటికి వెళ్ళి తల్లిదండ్రులకు కోల్పోయిన పిల్లలను చూసి ఆయన చలించిపోయారు. జరిగిన సంఘటన పిల్లలను అడిగి తెలుసుకున్నారు. పిల్లల యోగక్షేమాలు వారి చదువు గురించి కూడా మేనమామ అమీర్ ను అడిగి తెలుసుకున్నారు. పిల్లలిద్దరితో ఆయన కాసేపు ముచ్చటించారు.వ్యాస్ వెంట టీడీపీ నాయకులు యర్రా రాజా బెజవాడ నాగరాజు వాహబ్ ఖాన్ లు కూడా వున్నారు.

# ఆరోగ్యవంతమైన నియోజకవర్గం కోసం ఎమ్మెల్యే యార్లగడ్డ కృషి

- ఆరోగ్య కేంద్రాల్లో ప్రతి ఒక్క రికి తప్పనసరి వైద్యపరీక్షలు
- టౌన్ తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు అట్లూరి శ్రీనివాస్



**హనుమాన్ జంక్షన్,ఏప్రిల్ 13 (వార్తాప్రభ) :** గన్నవరం నియోజకవర్గాన్ని రాష్ట్రానికే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలని ధృఢశంకల్పంతో పనిచేస్తున్న శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు నియోజకవర్గ ప్రజలందరికి పి హెచ్ సి ఆధ్వర్యంలో ఉచితంగా షుగర్,బీపీ, బ్లడ్ టెస్టులు చేయించి, అవసరమైనవారికి వైద్యసహాయం అందిచమన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే ఆదేశాల మేరకు బాపులపాడు మండల కేంద్రమైన హనుమాన్ జంక్షన్, 8వ వార్డులో ఉచిత స్క్రీనింగ్, బ్లడ్ టెస్టులు సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు దయాల రాజేశ్వరరావు,టౌన్ పార్టీ అధ్యక్షులు అట్లూరి శ్రీనివాస్, కార్యదర్శి గార్లపాటి రాజేశ్వరరావు, మండల కార్యనిర్వాహక కార్యదర్శులు మొవ్వ వేణుగోపాల్, కర్ర ప్రసాద్,పొట్లూరి ఫణి, డాక్టర్స్ శ్రీనివాస్ , డాక్టర్ మధు , డాక్టర్ ప్రియ , డాక్టర్ జమీమా ,ఆశ వర్కర్స్, పాల్గొన్నారు.

# విజయభేరి సభలో నేత్రదానానికి భారీ అవార్డులు





**గుడివాడ,ఏప్రిల్ 13 (వార్తాప్రభ) :** ఆదివారం విజయవాడ -తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన విజయభేరి ఐకాన్ అంగరంగ వైభవంగా జరుపుకున్నా సందర్భంలో వాసవి జాగృతి క్లబ్ గుడివాడ అధ్యక్షులు శేగు వెంకట ప్రసాద్, నేత్రదాన ప్రోత్సాహకులు గాదె మోహన్ బాబు లకు అలాగే ఈ సంవత్సరం క్లబ్ తరఫున నేత్రదానం చేసిన 12 మంది కుటుంబీకులకు చిరు జ్ఞాపికలను అంతర్జాతీయ అధ్యక్షులు అయిన డా. తిరివీధి వేణుగోపాల్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ సుంకు చంద్రశేకర్ గుప్తా జిల్లా గవర్నర్ పొట్టి ముత్యపు ప్రభాకర్ డిస్టిక్ కో ఆర్డినేటర్ శేగు బబిత అభినందనలు తెలియజేశారు.

**వాసవి జాగృతి శ్రీ వరలక్ష్మి క్లబ్‌లో ఐకాన్‌ల -అవార్డులు :** వాసవి జాగృతి ఇంటర్నేషనల్ వారు వాసవి జాగృతి శ్రీ వరలక్ష్మి క్లబ్ పోరంకి, విజయవాడ వారు చేసిన నిరంతర సేవా కార్యక్రమాలు గుర్తించి మాకు ఐకాన్ లో అవార్డులు ఇవ్వడం జరిగింది. తిరువీధి వేణుగోపాల్, ఆయన సతీమణి వరలక్ష్మి లు ఆవిడ పేరున పెట్టిన క్లబ్ పోరంకిలో నిరంతరం 2025లో ఉగాది పండగ పర్వదినాన మొదలు పెట్టి నుండి 2026 ఉగాది వరకు సేవా కార్యక్రమాలు చేయడం జరిగింది. వాసవి జాగృతి శ్రీ వరలక్ష్మీ క్లబ్ పోరంకి విజయవాడ అధ్యక్షురాలు ఆర్యన్ కొలిపర్తి లక్ష్మీ దుర్గ సెక్రటరీ మోటమర్రి మౌనిక ట్రెజరర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

# తూరంగి పాస్టర్స్ ఇవాంజలిస్ ఫెలోషిప్ ప్రారంభం





**కాకినాడ,ఏప్రిల్ 13 (వార్తాప్రభ) :** స్థానిక తూరంగి జయప్రకాష్ నగర్లో జి డేవిడ్ రాజు ప్రార్థన మందిరంలో తూరంగి పాస్టర్స్ ఇవాంజలిస్ ఫెలోషిప్ ప్రారంభోత్సవం జరిగింది . ముఖ్య అతిథులుగా క్రిస్టియన్ కౌన్సిల్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పాస్టర్ మోసా అబ్రహాం పాల్గొన్నారు. పాస్టర్ డి. చార్లెస్ సభను ఉద్దేశించి దైవ సందేశం చేశారు. కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు అబ్రహాం మాట్లాడుతూ తూరంగి పాస్టర్స్ ఫెలోషిప్ కు ఎల్లప్పుడు క్రిస్టియన్ కౌన్సిల్ అండగా నిలుస్తుందని, క్రైస్తవులపక్షంగా రాష్ట్ర మంత్రి నారా లోకేష్ వెన్నెంట యున్నారని, రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు, క్రిస్టియన్ నాయకులు కొడాలి విజయ సహకారాలు మనకు ఎల్లప్పుడు ఉంటాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తూరంగి పాస్టర్స్ ఇవాంజలిస్ట్ ఫెలోషిప్ నూతన కార్యవర్గ అధ్యక్షులుగా ఎమ్. జాన్ పాల్, వైస్ ప్రెసిడెంట్ సిహెచ్ వరుణ్ కుమార్, సెక్రెటరీ టి. పిలిప్, ట్రెజరర్ గా ఎం. సుందర్ పాల్ ,మిగతా కార్యవర్గాన్ని ప్రకటించగా ఆమోదం తెలిపారు. అనంతరం బిషప్ పి. రత్నబాబు ప్రార్థనతో కార్యక్రమం ముగిసింది. కార్యక్రమంలో బి ఎస్ రత్నం, ఎం. శామ్యూల్, బి శ్యాం కుమార్ ,సత్య తలారి, సిహెచ్ జోసెఫ్ ,పి.బలరాం , సిహెచ్ సమర్పణ, జె ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

# రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ మీరు ఇచ్చే రక్తం -మరొకరికి ప్రాణం






**గుడివాడ,ఏప్రిల్ 13 (వార్తాప్రభ) :** సోమవారం ఆదిత్య కాలేజీ రక్తదాన శిబిరంలో విద్యార్థులు 30మంది ముందుకు వచ్చి రక్తం ఇవ్వటం జరిగింది. అలాగే ఏఎన్ఆర్ కాలేజీ నందు రక్తదాన శిబిరంలో 32మంది విద్యార్థులు ముందుకు వచ్చి రక్తం ఇవ్వటం జరిగింది. ఈ రక్తం ఏపిఎల్ & ఏఎన్ఆర్ ఏరియా హాస్పిటల్ గుడివాడ బ్లడ్ బ్యాంకు ఇవ్వటం జరిగింది. బ్లడ్ బ్యాంకు ఆఫీసర్, డిస్ట్రిక్ట్ నోడల్ ఆఫీసర్, డా॥ డి. విజయశ్రీ, డా॥ సిహెచ్ సుగుణవతి, ల్యాబ్ టెక్నీషియన్ జి. లక్ష్మణ్, హాస్పిటల్ సిబ్బంది పాలుగోన్నారు. ఆదిత్య కాలేజీ ప్రిన్సిపాల్ సిహెచ్ రవీంద్ర బాబు, ఎన్ఎస్ఎస్ కో ఆర్డనేటర్ శరత్ బాబు, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ వాలెంటీర్లు అనేక మంది సేవ దృక్పథంతో దానం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపాల్ చిట్టూరి రవీంద్రబాబు మాట్లాడుతూ క్రమం తప్పకుండా ఇస్తూ ఉంటే మరల మనకి కొత్త రక్తం ఏర్పడుతుంది. దీనివల్ల మనకి గుండెపోటు మరియు హృదయ సంబంధిత వ్యాధుల ప్రమాదాలు తగ్గుతాయి. కాబట్టి అందరూ సంవత్సరానికి నాలుగు సార్లు రక్తదానం చేయండి మరొకరి ప్రాణం నిలబెట్టండి. ఏఎన్ఆర్ కాలేజీ ప్రెసిడెంట్ ఎల్ ఆర్ కె ప్రసాద్, ప్రిన్సిపల్ పి.జె.ఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ ఎన్. పద్మజ, కాలేజీ కమిటీ మెంబెర్స్ పాలుగోన్నారు. రోటరీ ప్రెసిడెంట్ వై. నాగేశ్వరరావు, సెక్రటరీ జి. కిరణ్ బాబు, అసిస్టెంట్ గవర్నర్ ఎం. రమణ మూర్తి, పాస్ట్ ప్రెసిడెంట్స్ వై రెడ్డయ్య చౌదరి, బి. శంకర రావు, డా॥ సిహెచ్ సుగుణవతి, కొల్లి శ్రీనివాస రావు, కొల్లి వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థినికి సైకిల్ బహుకరణ..




**తిరువూరు టౌన్,ఏప్రిల్ 13 (వార్తాప్రభ) :** వేమూరి స్టీల్స్ వారి సౌజన్యంతో దస్త్రం పూజ సందర్భంగా 8వ తరగతి చదువుతున్న మధిర రోడ్డు చెందిన కంటిపూడి నాగదర్శి కి సైకిల్ అందజేసిన వేమూరి నాగ ప్రభాకర్ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గుడిమెట్ల మురళీ.. ఈ కార్యక్రమంలో తాపీ మేస్త్రులు వేమూరి స్టీల్స్ సిబ్బంది పాల్గొన్నారు..

# వాసవి జాగృతి క్లబ్ గుడివాడ వారిచే 13వ జత నేత్రాల సేకరణ



**గుడివాడ,ఏప్రిల్ 13 (వార్తాప్రభ) :** ఆదివారం సాయంత్రం విజయవాడ కృష్ణలంక వాస్తవ్యురాలు పచ్చిపులుసు అరుణకుమారి 60 సంవత్సరములు గాదె బదరి నారాయణరావు ఇచ్చిన సమాచారంతో ఆమె భర్త గారైన బాలకృష్ణ అనుమతి తో ఎల్ వి ప్రసాద్ ఐ ఇనిస్ట్యూట్ టెక్నీషియన్ హరీష్ ద్వారా కార్నియాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు శేగు వెంకట ప్రసాద్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ శేగు బబిత మరి ఒక డిస్టిక్ కోఆర్డినేటర్ గాదె మోహన్ బాబు లు పాల్గొని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ మరణించిన అరుణకుమారి నేత్రలను మరో ఇరువురుకి చూపుని ఇవ్వచ్చుని పేర్కొన్నారు.

# పూలే బీసీ గురుకుల పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రి,ఎమ్మెల్యే






**పెనుగంచిప్రోలు, వత్సవాయి,ఏప్రిల్ 13 (వార్తాప్రభ) :** జగ్గయ్యపేట నియోజకవర్గం, వత్సవాయి మండలం, వత్సవాయి గ్రామంలో ఉన్న మహాత్మ జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలను రాష్ట్ర బీసీ, ఈ డబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత , ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యా ప్రమాణాలు, వసతులు, హాస్టల్ నిర్వహణ, భోజన నాణ్యత తదితర అంశాలను వారు ప్రత్యక్షంగా పరిశీలించారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి బోధన విధానం, ఉపాధ్యాయుల పనితీరును సమీక్షించారు. హాస్టల్‌ను సందర్శించిన మంత్రి సవి త , ఎమ్మెల్యే ఆహార నాణ్యతను పరిశీలించారు. విద్యార్థుల నుంచి నేరుగా అభిప్రాయాలు తెలుసుకుని, ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.స్టోర్ రూమ్‌ను తనిఖీ చేసిన మంత్రి నిల్వ ఉంచిన సరుకుల నాణ్యతపై దృష్టి సారించి, వాటిని శుభ్రంగా మరియు క్రమబద్ధంగా నిర్వహించాలని సూచించారు. హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి ఆదేశించారు.అనంతరం పాఠశాలకు సహకరించిన దాతలను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మంచి వసతులు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) మాట్లాడుతూగురుకుల పాఠశాలలు పేద మరియు మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్య సాధనలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించేలా అధికారులు కృషి చేయాలని కోరారు.రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇటీవల విద్యా రంగంలో చేపట్టిన సంస్కరణల నేపథ్యంలో గురుకుల పాఠశాలల్లో బోధన ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు. డిజిటల్ విద్య, ఇంగ్లీష్ మీడియం బోధన, నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచనలు ఉన్నట్లు తెలిపారు.ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు దృష్టి రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించాలనే సంకల్పంతో పనిచేస్తున్నారని ఈ సందర్భంగా తెలిపారు. గురుకుల పాఠశాలలను ఆదర్శవంతమైన విద్యాసంస్థలుగా అభివృద్ధి చేయడం, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడం ప్రభుత్వ ప్రాధాన్యతగా ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు మరింత సమర్థవంతంగా అమలు కావాలనే ఉద్దేశంతో ఈ ఆకస్మిక తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలలో ఉన్న కూటమి నాయకులు మరియు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వంతెన నిర్మించాలంటూవేద వ్యాస్ కు విన్నవించిన కత్తిరెడ్డి పాలెం గ్రామస్తులు



**గూడూరు,ఏప్రిల్ 13 (వార్తాప్రభ) :** గ్రామస్తులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న వంతెనను నిర్మించేందుకు సహకరించాలంటూ కత్తిరెడ్డి పాలెం గ్రామస్తులు బూరగడ్డ వేదవ్యాస్ ను కోరారు. పెడన నియోజకవర్గం గూడూరు మండలం కంకటావ పంచాయతీ కత్తిరెడ్డి పాలెం గ్రామస్తులు సోమవారం సాయంత్రం బందరు రాజుపేట లోని ఆయన నివాసంలో కలుసుకుని కొత్త వంతెన నిర్మాణం కోసం మొరపెట్టుకున్నారు. గత నాలుగు సంవత్సరాల క్రితం లజ్జబండ మేజర్ డ్రైన్ మీద వున్న ఈ వంతెన శిదిలావస్థకు చేరి పడిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చిన రెండు సంవత్సరాల నుంచి కూడా వంతెన నిర్మాణం కోసం గ్రామస్తులు ప్రయత్నిస్తున్నప్పటికీ ఇప్పటికీ ఫలితం కనిపించలేదని వారు ఆవేదన చెందుతున్నారు.ప్రస్తుతానికి కర్రల ఆధారంతో వంతెన ను ఏర్పాటు చేసారు. అయితే పూర్తిస్థాయిలో వంతెనను నిర్మించవలసి ఉందని గ్రామస్తులు వేదవ్యాస్ కు చెప్పారు. సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామస్తుల సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళతానని వ్యాస్ హామీ ఇచ్చారు.టీడీపీ గ్రామ పార్టీ ఉపాధ్యక్షుడు యర్రపోతు గంగాధరరావు వీరమల్లు మాజీ సర్పంచి భీమన నాంచారయ్య శివన్నారాయణ బావి శెట్టి గంగాధర్ రావు తోట ప్రభుదాస్ తదితరులు వ్యాస్ ను కలిశారు

# అంగన్వాడీ.కేంద్రం -3 లో పోషణ పక్వాడ కార్యక్రమం..



**పెనుగంచిప్రోలు,ఏప్రిల్ 13 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా చిల్లకల్లు ప్రాజెక్ట్ సీడీపీఓ సత్య వాణి ఆదేశాల మేరకు పెనుగంచిప్రోలు అంగన్వాడీకేంద్రం -3 లో పోషణ పక్వాడ కార్యక్రమం సోమవారం నిర్వహించటం జరిగినది.ఈ కార్యక్రమంలో స్త్రీ గర్భం దాల్చిన దగ్గరనుండి బిడ్డకు 2 సంవత్సరాములు నిండే అంతవరకూ ఈ మధ్య కాలాన్ని థౌసండ్ డేస్ కేర్ అంటారు. ఈ సమయంలో బిడ్డ యొక్క ఎదుగుదల మరియు వారుతీసుకోవలసిన జాగ్రత్తల గురించి గర్భవతులకు బాలింతలకు వివరించటం జరిగినది. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సంఘం అధ్యక్షురా లు సువ ర్చ ల, నాగ మణి, విమల, దామాల వాణి, రాజ్యాలక్ష్మి, విజయ లక్ష్మి. మంజుల, సునీత, ఝాన్సీ, జయలక్ష్మి, కల్పన, సీత,దుర్గా,భారతి, ఏ ఎన్ యం.లు గర్భవతులు బాలింతలు, తల్లులు, అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్స్, పాల్గొన్నారు...

# రోడ్డు భద్రత -- సురక్షితమైన ప్రయాణం ప్రతి ఒక్కరి బాధ్యత : ఎస్సై యం.రమాదేవి



**భద్రాద్రి కొత్తగూడెం,ఏప్రిల్ 13 (వార్తాప్రభ) :** తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "అరైవ్ అలైవ్" అవగాహన కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సుజాతనగర్ మండల పరిధిలోని పలు వార్డు లలో , ఎస్సై, యం.రమాదేవి ఆధ్వర్యంలో సోమవారం గ్రామపంచాయతీలలో రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం చేపట్టి రోడ్డు భద్రత కమిటీలు ఏర్పాటు చేశారు అనంతరం ప్రజలకు ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతను వివరించి, వాటిని కచ్చితంగా పాటించాలని, సురక్షిత ప్రయాణానికి సంబంధించిన ప్రతిజ్ఞను చేయించారు. ఈ సందర్భంగా ఎస్సై, యం రమాదేవి మాట్లాడుతూ రోడ్డు భద్రత, సురక్షితమైన ప్రయాణం ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించినప్పుడే రోడ్డు ప్రమాదాలను సమర్థవంతంగా నియంత్రించగలమని తెలిపారు. రోడ్డు ప్రమాదాల గణాంకాలను పరిశీలిస్తే, ఎక్కువ శాతం ప్రమాదాలు మానవ నిర్లక్ష్యం వల్లే జరుగుతున్నాయని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం,హెల్మెట్, సీటుబెల్ట్ వాడకంలో అలసత్వం వంటి కారణాలే ప్రమాదాలకు ప్రధాన కారణాలన్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు అవగాహన అత్యంత అవసరమని భావించి 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని రూపొందించారని చెప్పారు.ద్విచక్ర వాహనాలు డ్రైవింగ్ చేసే వారితో పాటు వెనుక కూర్చునే వారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, వాహనం నడిపే సమయంలో సిట్ బెల్ట్ తప్పని సరిగా పెట్టుకోవాలన్నారు.రక్షణాత్మక డ్రైవింగ్ దృష్టి పెట్టాలని, అప్రమత్తంగా, సురక్షితంగా ఉండటం చాల కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో , అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ రాకేష్ , సిబ్బంది, శానిటరీ ఇన్స్పెక్టర్, ఏఎన్ఎం , ఆశా వర్కర్లు, వార్డ్ సభ్యులు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్ యోగాతో ఆరోగ్యం మీ చేతుల్లో..

● ప్రతి రోజూ ప్రతి ఇంటా ఒక గంట యోగాసనాలు ● శారీరక, మానసిక ఆరోగ్యానికి మంచి మార్గం ● జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ







**విజయవాడ,ఏప్రిల్ 13 (వార్తాప్రభ) :** శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని సొంతం చేసుకునేందుకు వీలుకల్పించే యోగాను ఆధునిక సాంకేతికత సహాయంతో ఇంటి నుంచే ఆచరించేందుకు, ఆనందమయ జీవితాన్ని సొంతం చేసుకునేందుకు ఆన్‌లైన్ యోగా అద్భుత అవకాశమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. సోమవారం కలెక్టర్ లక్ష్మీశ.. స్థానిక ఇందిరాగాంధీ మునిసిపల్ మైదానంలోని అమరావతి యోగా అండ్ ఏరోబిక్స్ అసోసియేషన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో అమరావతి యోగా యూట్యూబ్ ఛానల్ ప్రత్యక్ష ప్రసారాలను కలెక్టర్ లక్ష్మీశ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమం ద్వారా ప్రజల్లో యోగాసాధనపై మంచి అవగాహన ఏర్పడిందని.. ఎంతో మంది యోగాచరణను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకున్నారన్నారు. ఫ్లోటింగ్ యోగాతో పాటు వివిధ కేటగిరీల్లో జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో ప్రపంచ రికార్డులు సొంతం చేసుకున్నామన్నారు. నగరంలోని బీఆర్‌టీఎస్ రోడ్డును యోగా స్ట్రీట్‌గా నామకరణం చేసి నెల రోజుల పాటు రోజుకో థీమ్‌తో అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములను చేసి ప్రజల్ని యోగా దిశగా ప్రోత్సహించినట్లు వివరించారు. అన్నదాతలు, పోలీసులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పారిశ్రామికవేత్తలు, ఎన్‌జీవోలు, ఉద్యోగ సంఘాలు, పారిశుద్ధ్య కార్మికులు, వైద్యులు, అంగన్వాడీ కార్యకర్తలు... ఇలా అన్ని వర్గాలకూ యోగాంధ్రలో భాగస్వామ్యం కల్పించినట్లు తెలిపారు.

**ఆన్‌లైన్ యోగా మంచిదేగా..** వ్యక్తిగతంగా యోగా సాధన కోసం హాజరుకాలేని వారం కోసం అమరావతి యోగా యూట్యూబ్ ఛానల్‌లో ప్రత్యక్ష ప్రసారం దోహదం చేస్తుందన్నారు. ప్రపంచంలో ఎక్కడ ఉన్నా ఈ ఆన్‌లైన్ యోగా తరగతుల ఆధారంగా యోగాసనాలు ఆచరించవచ్చని.. తద్వారా ఆరోగ్యకర ఆనందమయ జీవితాన్ని సొంతం చేసుకోవచ్చని పేర్కొన్నారు. మన వారసత్వ సంపద అయిన యోగా ఆచరణ ద్వారా ఎప్పటికప్పుడు కొత్త చైతన్యంతో జీవితంలో ముందడుగు వేయొచ్చన్నారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే యోగాను ఆచరించడం ద్వారా జీవితాంతం ఉత్సాహంగా ఉంటూ లక్ష్యాల సాధన దిశగా పయనిస్తూ విజయాలు సొంతం చేసుకోవచ్చని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. కార్యక్రమంలో అమరావతి యోగా అసోసియేషన్ ప్రెసిడెంట్ డి.వి.నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ టి.హరికృష్ణ, డి.కాశీవిశ్వనాథ్, ట్రెజరర్ ఎ.లావణ్య కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.ప్రశాంత్ కుమార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎ.ఎల్లారావు, ఎం.ఈశ్వరరావు, మహిపాల్, యోగా కోచ్ అంకాల సత్యనారాయణ పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్ ను ఆకస్మిక పరిశీలించిన ఎమ్మెల్యే



**నందిగామ ,ఏప్రిల్ 13 (వార్తాప్రభ) :** స్థానిక రైతు బజార్ ఆవరణలో ఉన్న అన్న క్యాంటీన్ ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సోమవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పరిసర ప్రాంతాల పరిశుభ్రత, త్రాగునీరు, భోజన సదు-పాయాల నాణ్యతపై స్థానిక ప్రజల అభిప్రాయాలను ఎమ్మెల్యే సౌమ్య స్వయంగా అడిగి తెలుసుకున్నారు. భోజనం కోసం వచ్చిన సామాన్యులను ఆప్యాయంగా పలకరిస్తూ, భోజనం రుచిని, నాణ్యతను ప్రశ్నించారు. సిబ్బంది రోజువారీ హాజరు పట్టికను పరిశీలించి పనితీరును సమీక్షించారు.అన్న క్యాంటీన్ నిర్వహణలో పారదర్శకత, ప్రజలకు అందించే సేవలపై ప్రత్యేక దృష్టి పెట్టారు.

**ఆర్థిక సహాయం -- ప్రజలతో భోజనం:** ట్వింకిల్స్ విద్యా సంస్థల అధినేత వేమూరి హర్ష - స్వప్న దంపతులు 25 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అన్న క్యాంటీన్‌కు అందచేశారు.అనంతరం తంగిరాల సౌమ్య ప్రజలతో కలిసి భోజనం చేస్తూ, అన్న క్యాంటీన్ లక్ష్యాన్ని మరింత బలపరిచారు.

## నూతన జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసి) ఎన్నిక



**గిద్దలూరు,ఏప్రిల్ 13 (వార్తాప్రభ) :** గిద్దలూరు పట్టణంలోని స్థానిక ఎన్జీవో హోం లో సోమవారం సాయంత్రం 5 గంటలకు జేఏసీ నూతన కమిటీ ఎన్నిక కోసం ప్రభుత్వ ఉద్యోగులు మరియు ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహించడమైనది. ఈ సమావేశంలో గిద్దలూరు తాలూకా జేఏసీ చైర్మన్ గా టి. నరేష్ బాబు, కో చైర్మన్ కమ్ వైస్ చైర్మన్ గా డాక్టర్ మొర్రి.పిచ్చయ్య, సెక్రటరీ జనరల్ గా యం.కాశీ రమణ , ఉపాధ్యక్షులు గా డి.వి. పిచ్చయ్య, టి. సుబ్బరాయుడు, బి.రాజ గోపాల్ రెడ్డి, జే.యం.శివ ప్రసాదు లను, జాయింట్ సెక్రటరీలుగా డి.పుల్లయ్య, పి.నాగేశ్వరరావు, యన్. రామకృష్ణ లను, ట్రెజరర్ గా యన్. సాయి ప్రసాద్, సభ్యులుగా జి .బాల వెంకటేశ్వర్లు, పి. రంగారెడ్డి, పాశం. ప్రసాద్, యస్.వెంకట శేషు కుమార్, యస్. రంగస్వామి, పి.ఎస్. నాయక్, యన్.ఆర్. చంద్ర మోహన్, బి. రమేష్ బాబు, చంద్రమోహన్,బి.నాగార్జున లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. వీరు 3 సంవత్సరాల పాటు కమిటీ బాధ్యులుగా కొనసాగుతారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు కార్యకలాపాలు చేయవలసి ఉండును. ఎన్నికైన నూతన కమిటీ సభ్యులను పలు సంఘ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

## జలియన్ వాలాబాగ్ సంస్మరణ దినోత్సవం...



**కృత్తివెన్ను,ఏప్రిల్ 13 (వార్తాప్రభ) :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పల్లె పాలెం నందు జలియన్ వాలాబాగ్ సంస్మరణ దినోత్సవం సందర్భంగా పాఠశాల ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయులు కొప్పినీడి సూర్య ప్రకాష్ మాట్లాడుతూ1919 ఏప్రిల్ 13 న అమృతసర్ లో జరిగిన హత్యాకాండ భారతదేశ చరిత్రలో అత్యంత చీకటి అధ్యాయమని అన్నారు.పంజాబ్ లోని అమృతసర్ లో జనరల్ డయియర్ నేతృత్వం లో బ్రిటిష్ సైన్యం రౌలత్ చట్టానికి నిరసనగా జలియన్ వాలాబాగ్ లో శాంతియుతంగా సమావేశమైన నిరాయుధులైన భారతీయులపై ఎటువంటి ముందు హెచ్చరికలు లేకుండా విచక్షణారహితంగా 1650 రౌండ్లు కాల్పులు జరిపించారని,నిరాయుధులైన స్త్రీలు పురుషులు పిల్లలు వృద్ధుల పై సుమారు 10 నిముషాలపాటు ఈ కాల్పులు జరిపించారని అప్పటి ఆంగ్ల ప్రభుత్వం లెక్కల ప్రకారం 379 మంది మరణించారని,కానీ వాస్తవ గణాంకాల ప్రకారం1000 కి పైగా మరణించారని,2000 మందికి పైగా గాయ పడ్డారని అన్నారు. ఈ దురశీతమ్ బ్రిటీష్ పాలన యొక్క క్రూరత్వానికి చిహ్నం గా నిలిచిపోయిందని,ఈ సంఘటనతో భారత స్వాతంత్ర్య పోరాటంలో కీలక మలుపుగా మారిందని భారతీయులలో స్వాతంత్ర్య కాంక్ష మరింత బలపడిందని ఈ దమనకాండ కు నిరసనగా రవీంద్రనాథ్ ఠాగూర్ బ్రిటిష్ ప్రభుత్వం తనకు ఇచ్చిన “నైట్ హుడ్” బిరుదును త్యజించారు అని సూర్య ప్రకాష్ తెలిపారు.అనంతరం ఈ మారణకాండ లో అమరులైన వారికి 2నిమిషాలు మౌనం పాటించి వారికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్య క్రమంలో ఉపాధ్యాయులు మురళీకృష్ణ, ప్రభ రేఖ దుర్గా జ్యోతి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## కొండలమ్మ భక్తులకు మజ్జిగ పంపిణీ...



**గుడ్లవల్లేరు,ఏప్రిల్ 13 (వార్తాప్రభ) :** మండు వేసవిని దష్టిలో పెట్టుకుని మండలంలోని వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన్‌రావు(మోహన్) చేతుల మీదుగా ఈ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

## రాజ్యాంగ నిర్మాత జయంతి వేడుకలు

**పెడన,ఏప్రిల్ 13 (వార్తాప్రభ) :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పల్లెపాలెం నందు ఘనంగా సోమవారం నిర్వహించారు .ముందుగా పాఠశాల ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయుడు కొప్పినీడి సూర్య ప్రకాష్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రముఖ భారతీయ న్యాయ-ంవాది ,ఆర్థిక శాస్త్రవేత్త, రాజకీయ నేత ,సంఘసంస్కర్త, కుల నిర్మూలన కోసం చేసి భారత రాజ్యాంగ నిర్మాతగా కీర్తి గడించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. భారతదేశం మొట్టమొదటి న్యాయశాఖ మంత్రి అని ఈయన 1891లో ఏప్రిల్ 14వ తారీకు తేదీన జన్మించారని, ఈయన జన్మదినాన్ని" సమానత్వ దినోత్సవం "అని కూడా పిలుస్తారని అన్నారు. ఈయన కొలంబియా విశ్వవిద్యాలయం నుండి పీహెచ్డీ లండన్ విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పట్టాలను పొంది చాలా అరుదైన గౌరవాన్ని సంపాదించారని ,న్యాయ సామాజిక ఆర్థిక శాస్త్రాలలో పరిశోధనలు చేశారని న్యాయవాదిగా అధ్యాపకుడిగా ఆర్థికవేత్తగా



పనిచేశారని, భారత దేశ స్వాతంత్రం పత్రికల ప్రచురణ దళితుల సామాజిక రాజకీయ హక్కులు భారతదేశ రాజ్యాంగ వ్యవస్థాపన కోసం కృషిచేసిన గొప్ప మేధావి అని 1990లో భారత ప్రభుత్వ అత్యున్నత పురస్కారం భారతరత్నను ఈయన మరణానంతరం భారత ప్రభుత్వం ప్రకటించింది అని సూర్య ప్రకాష్ అన్నారు .ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళీకృష్ణ ప్రభ రేఖ దుర్గా జ్యోతి విద్యార్థులు పాల్గొన్నారు.

## అమరావతి రాజధాని మన హక్కు, దాన్ని కాపాడుకోవడం మన బాధ్యత

● మలయాళ సినిమా పేరులా ఉన్న 'మావిగన్' ● మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

● కొండపల్లిలో పురపాలక సంఘం తెదేపా సమావేశం.

**ఇబ్రహీంపట్నం,ఏప్రిల్ 13 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతిని నిర్ణయిస్తూ అసెంబ్లీలో తీర్మానం, పార్లమెంటులో చట్టబద్ధత, రాజ్యసభలో ఆమోదం పొందిందని, అమరావతి రాజధాని మన హక్కు అని, దీన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ పేర్కొన్నారు.కొండపల్లిలో పురపాలక సంఘం తెలుగుదేశం పార్టీ సమావేశం సోమవారం సాయంత్రం జరిగింది. అన్న ఎన్టీఆర్ గారి



విగ్రహానికి ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు గారు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ అమరావతిపై జగన్మోహనరెడ్డి విషప్రచారం చేస్తున్నాడని అన్నారు. 'మావిగన్' అంటూ తన సైకోతత్వాన్ని మరోసారి చాటుకున్నాడని అన్నారు. మావిగన్ అంటే మలయాళ సినిమా పేరులా ఉందని ఎద్దేవా చేశారు. జగన్ మూర్ఖత్వం, పిచ్చితనానికి అతని చర్యలు అద్దం పడుతున్నాయని అన్నారు. కొండపల్లి మున్సిపాలిటీలో మ్యాజిక్ డ్రెయిన్స్ నిర్మాణానికి అర్బన్ డెవలప్మెంట్ నుంచి రూ.25.40 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. టీడీపీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు ప్రణాళిక బద్ధంగా పని చేయాలన్నారు. దేశంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలు అమరావతికి మద్దతు ఇస్తే వైసీపీ మాత్రం అమరావతికి మద్దతు ఇవ్వలేదని అన్నారు. దీనిపై గ్రామాల్లో వైసీపీ నేతలను నిలదీయాలన్నారు. వైసీపీ కుట్రలు తిప్పికొట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, తదితరులుపాల్గొన్నారు.

## దాతృత్వంలో జేబీ సైన్యం ముందడుగు చలివేంద్రం ఏర్పాటు

-సుబ్బారాయుడు చెరువు వద్ద బాటసారుల దాహార్తిని తీరుస్తున్న మజ్జిగ పంపిణీ

**అమలాపురం,ఏప్రిల్ 13 (వార్తాప్రభ) :** అమలాపురం పట్టణంలో నిరంతరం సేవా కార్యక్రమాలతో దూసుకుపోతున్న జేబీ సైన్యం, ప్రస్తుత వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సామాన్యుల కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసింది. పట్టణంలో అత్యంత రద్దీగా ఉండే సుబ్బారాయుడు చెరువు ప్రాంతం లో ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఎండల తీవ్రత దృష్ట్యా కేవలం నీటినే కాకుండా,




ముఖ్యంగా ఆసుపత్రులకు వచ్చే రోగులకు, వారి సహాయకులకు ఈ చలివేంద్రం ఎంతో ఆసరాగా నిలుస్తోంది.ఎండలు మండిపోతున్న ఈ తరుణంలో బాటసారుల దాహార్తిని తీర్చడం అభినందనీయం అని స్థానికులు జేబీ సైన్యం సభ్యులను కొనియాడారు. జవ్వాది బాబు,తులా రాంబాబు,రెడ్డి రాజు, తూము సాయి,రంకిరెడ్డి సూరి, బాటసారులకు ఉపశమనం కలిగించేలా మజ్జిగ పంపిణీ చేస్తున్నారు.వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వచ్చే ప్రజలకు, మట్టపర్తి బాలు,అమీర్,నమ్మిన దుర్గారావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రేపు విజయవాడలో ఘనంగా డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి రాష్ట్ర స్థాయి వేడుకలు

----సాంఘిక సంక్షేమ శాఖ సంచాలకులు బి. లావణ్య వేణి

**విజయవాడ, ఏప్రిల్ 13 (వార్తాప్రభ) :** భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డా. బి.ఆర్. అంబేద్కర్ 135 వ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏప్రిల్ 14, 2026 మంగళవారం ఉదయం 11.30 గంటలకు విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళా క్షేత్రంలో రాష్ట్ర స్థాయి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ సంచాలకులు బి. లావణ్య వేణి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తోపాటు ఇతర మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొని డా. అంబేద్కర్ కి ఘన నివాళులు అర్పించనున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో కూడా అంబేద్కర్ జయంతి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సాంఘిక సంక్షేమ శాఖ సంచాలకులు బి. లావణ్య వేణి ఆ ప్రకటనలో తెలియజేశారు.

## బంటుమిల్లి జగనన్న కాలనీలో మట్టి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే...



**కృత్తివెన్ను,ఏప్రిల్ 13 (వార్తాప్రభ) :** చిన్నపాటికి వర్షానికి చెరువులను తలపిస్తున్న బంటుమిల్లి జగనన్న కాలనీకి ఎట్టకేలకు మోక్షం లభించనుంది. సోమవారం నాడు పెడన ఎంఎల్ఏ కృష్ణ ప్రసాద్ రోడ్డు పూడిక పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం నివాసానికి యోగ్యం కానీ స్థలాలను పేదలకు పంచి తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు. అందిన కాడికి అప్పులను తెచ్చి ఇల్లు నిర్మించుకున్న పేదలు ఈ కాలనీలో నానా ఇబ్బందులు పడుతున్నారని, తింటున్నారు భూమి ఇచ్చి మౌలిక సదుపాయాల కోసం కోట్ల రూపాయలు దండుకున్నారని దుయ్యపట్టారు. గత ప్రభుత్వ తీరుతో ఇబ్బంది పడ్డ మీ అందరికీ అండగా నిలబడుతూ ఈ కాలనీకి మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేస్తానని లబ్ధిదారులకు హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో రెండు కాలనీలను మోడల్ కాలనీలుగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం వద్ద నుంచి అనుమతులు లభించాయని, ఒకటి పెడన కాలనీ కాగా రెండోది బంటుమిల్లి కాలనీ అని లబ్ధిదారుల అర్షద్వానాల మధ్య ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు కూనపురెడ్డి వీరబాబు బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ అంగర రంగనాథ్, కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఇల్లూరి లీలా కృష్ణ జనసేన అధ్యక్షుడు ర్యాలీ సత్యనారాయణ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ భూపతి రమేష్ మాజీ జెడ్పిటిసి దాసరి కరుణ జ్యోతి సర్పంచులు రేవు గోపాలకృష్ణ రేవు శ్రీనివాసరావు తదితర కూటమి నాయకులు కార్యకర్తలు అధికారులు కాలనీవాసులు తదితరులు పాల్గున్నారు....

## ఘనంగా నవభారత్ వార్షికోత్సవ వేడుకలు

**గన్నవరం,ఏప్రిల్ 13 (వార్తాప్రభ) :** ముస్తాబాద్ నవభారత్ హై స్కూల్ 24 వ వార్షికోత్సవ వేడుకలు నిన్న సాయంత్రం ఘనంగా జరిగాయి.. ముఖ్యఅతిథిగా విశ్రాంతి న్యాయమూర్తి పి జయ బాబు గారు, అతిథులుగా విశ్రాంతి ప్రధానోపాధ్యాయులు కె జగన్నాథం జిల్లా పరిషత్ హై స్కూల్ మద్దాయిగుంట ప్రధానోపాధ్యాయులు డి భాస్కర రావు హాజరయ్యారు. పాఠశాల కరస్పాండెంట్ షేక్ ఇమామ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తొలుత పాఠశాల ప్రిన్సిపల్ షేక్ జాకిర సుల్తానా వార్షిక నివేదికను చదివి వినిపించారు, ఈ సంవత్సరం పాఠశాలలో నిర్వహించిన అనేక కార్యక్రమాల గురించి చక్కగా వివరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విశ్రాంత న్యాయమూర్తి పి జయ బాబు గారు మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదువులోనే కాకుండా అన్ని రంగాలలోనూ అభివృద్ధిని సాధించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు కూడా విద్యార్థినీ విద్యార్థులు ఏ రంగంలో ఆసక్తి చూపిస్తున్నారు అనేది గుర్తించి వారి అభివృద్ధికి బాటలు వేయాలని సూచించారు. విశ్రాంత ప్రధాన ఉపాధ్యాయులు శ్రీ కే జగన్నాథం మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థుల కదలికలను తల్లిదండ్రుల గమనించాలని ముఖ్యంగా ఆండ్రాయిడ్ సెల్ ఫోన్ వంటి సాధనాలకు విద్యార్థులను దూరంగా




ఉంచాలని, ప్రతిరోజు తల్లిదండ్రులు విద్యార్థులతో కాసేపు ముచ్చటించాలని, పాఠశాలలో జరిగిన విషయాలను వారి నుండి తెలుసుకోవాలని సూచించారు, జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు భాస్కరరావు మాట్లాడుతూ ఒక పాఠశాలకు కావలసిన లక్షణాలు అన్నీ కూడా నవభారత్ హై స్కూల్ లో ఉన్నాయని, విద్యార్థినీ విద్యార్థులకు కావలసిన అన్ని రకాల సౌకర్యాలు పాఠశాలలో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులు పాఠశాల నుండి రాగానే ఈరోజు ఏం వర్క్ ఇచ్చారు అనేది చెక్ చేయాలని, తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాఠశాల యాజమాన్యం అందరూ కలిస్తేనే విద్యార్థి యొక్క భవిష్యత్తుకు బాటలు వేయవచ్చని కనుక ప్రతి విషయంలోనూ విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులను యాజమాన్యాన్ని కలిసి తమ పిల్లల యొక్క చదువు ఎలా సాగుతుంది అనే అంశం మీద తరచూ చర్చిస్తూ ఉండాలని సూచించారు. ఎల్కేజీ మరియు యూకేజీ విద్యార్థుల విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ప్రతి తరగతి లో అటెండెన్స్ మరియు స్టడీస్ విభాగంలో మొదటి మూడు స్థానాలు పొందిన విద్యార్థుల విద్యార్థులకు బహుమతులు అందజేయడం జరిగింది.. పి మాన్విత ప్రదర్శించిన క్లాసికల్ డాన్స్ అందర్నీ ఆ కట్టుకున్నది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188